VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి, నల్గొండ : ఆదివారం 12.07.2026
సంపుటి : 09 సంచిక : 33 , పేజీలు : 12 , వెల:రూ . 5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH
www.velthuru.com



## ఘనంగా బండి సంజయ్ బర్త్ డే వేడుకలు

# కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం మానాలి





- చిట్ చాట్ లో సీఎం రేవంత్
- ఎన్డీఎస్ఏ అనుమతిస్తేనే నీళ్లు ఎత్తిపోతాం.. ఈటలకు సీఎం రెండు సవాళ్లు
- మేడిగడ్డలో నీటి నిల్వ సురక్షితం కాదన్న ఎన్డీఎస్ఏ తుది నివేదిక
- కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోసే పరిస్థితి ప్రస్తుతం లేదన్న సీఎం
- హరీశ్ సూచనలతోనే ఈటెల మాట్లాడు తున్నారని ఆరోపణ
- కాళేశ్వరం లోపాలపై 2020లోనే అధికారులు హెచ్చరించారని వెల్లడి
- మూడు బ్యారేజీలూ దెబ్బతిన్నాయని ఎన్డీఎస్ఏ స్పష్టీకరణ
- గేట్లు మూసి నీరు నిల్వ చేయొద్దని నిపుణుల సూచన
- కాళేశ్వరం పునరుద్ధరణకు కేంద్ర సాంకేతిక కమిటీ ఏర్పాటు
- సీబీఐ విచారణ వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరిన సీఎం
- ఎన్డీఎస్ఏను ఒప్పిస్తే ప్రభుత్వం కూడా ముందుకు వస్తుందన్న రేవంత్

## భూ రీసర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- మార్చి 2027 నాటికి మూడు విడతల్లో పూర్తి చేయాలని ఆదేశం
- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ మంత్రి స్పష్టీకరణ




ఖమ్మం వెలుతురు జూలై 11:

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## డిప్యూటీ సీఎం సర్జరీ విజయవంతం



- కుడి భుజానికి శస్త్ర చికిత్స..
- రెండు నెలల తర్వాత మరో భుజానికి!
- ముంబై ఆసుపత్రిలో విజయవంతంగా ముగింపు
- మూడున్నర గంటల పాటు సాగిన ఆపరేషన్
- ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో డిప్యూటీ సీఎం
- రెండు నెలల తర్వాత ఎడమ భుజానికి శస్త్ర చికిత్స
- వైద్యుల ప్రణాళికాబద్ధమైన నిర్ణయం

## హైదరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్..



- తెలంగాణకు రూ.5 వేల కోట్ల రైల్వే బడ్జెట్
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి
- హైదరాబాద్‌ను చెన్నై, బెంగళూరుతో అనుసంధానిస్తాం

## జవహర్ బాల్ మంచ్ రెండు రోజుల "మిరాయి" జాతీయ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్





## నన్ను తాకితే ఇరాన్ కథ సమాప్తం



- అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ సంచలన హెచ్చరిక
- వైట్ హౌస్, పెంటగాన్‌కు అత్యవసర ఆదేశాలు
- ఇరాన్ 'కిల్ లిస్ట్'పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం
- తనను హతమార్చాలని చూస్తే బాంబుల వర్షం తప్పదని హెచ్చరిక
- వైట్ హౌస్, అమెరికా సైన్యానికి జారీ అయిన కఠిన ఆదేశాలు
- చరిత్రలో ఎన్నడూ చూడని రీతిలో భీకర సైనిక చర్య
- టెహ్రాన్ హిట్ లిస్ట్‌లో చాలా కాలంగా మొదటి స్థానం నాదే

## జులై 30 నాటికి అయోధ్య నిర్మాణ పనులు పూర్తి



- కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా వెల్లడి
- విరాళాల చోరీపై సుప్రీంకోర్టు విచారణ
- తుది దశకు రామాలయ నిర్మాణం
- జులై ఆఖరు నాటికి ప్రధాన పనులన్నీ పూర్తి
- అనుబంధ స్మారకాల పనులు దాదాపు ముగింపు
- అఖండ జ్యోతి ఏర్పాటే చివరి అంకం

## హైదరాబాద్‌కు భారీ విమాన సేవలు



- హైదరాబాద్‌కు భారీ ప్రయాణికుల విమానాల రాకపై సానుకూల సంకేతాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో విమానయాన సంస్థ ప్రతినిధుల భేటీ
- విమాన సర్వీసుల విస్తరణకు రాష్ట్రం నుంచి ఆహ్వానం
- వరంగల్, ఆదిలాబాద్ విమానా శ్రయాల అభివృద్ధిపై వివరణ
- విమానాల మరమ్మతు కేంద్రాల ఏర్పాటుకు ఆహ్వానం
- పూర్తి సహకారం అందిస్తామని ప్రభుత్వ హామీ
- క్రీడాకారుల శిక్షణకు చేయూతని వ్వాలని విజ్ఞప్తి
- ప్రతిపాదనలను పరిశీలిస్తామని సంస్థ హామీ

## దేశంలో తొలి సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీస్ హబ్

- టీ-వర్క్స్‌లో లాంఛనంగా ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్ వెలుతురు జూలై 11:

సెమీకండక్టర్ల తయారీ రంగంలో తెలంగాణ మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో చిప్‌ల తయారీలో అత్యంత కీలకమైన కెమికల్ మెకానికల్ పాలిషింగ్ (సీఎంపీ) ప్యాడ్ టెక్నాలజీకి సంబంధించిన దేశంలోనే తొలి హబ్ హైదరాబాద్‌లో ఏర్పాటైంది.

## న్యూజిలాండ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి శ్రీకారం

- నాలుగు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని న్యూజిలాండ్ పర్యటన
- ఇరు దేశాల సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేరిక



## కోదాడలో 17 కోట్ల రూపాయల తో నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట జిల్లా వెలుతురు జూలై 11:



కోదాడలో నియోజకవర్గ కేంద్రంలో 17 కోట్ల రూపాయల తో నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ,ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,జిల్లా కలెక్టర్,ఇతర ముఖ్య నేతలు,

# కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం మానాలి

- ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని విమర్శ

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని ఎత్తిపోసే అవకాశం లేదని, ఇందుకు జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) నివేదికే స్పష్టమైన ఆధారమని తెలిపారు. ఎన్డీఎస్ఏ అనుమతిస్తే ప్రభుత్వం కూడా నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో మాట్లాడిన సీఎం, బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్, బీఆరెస్ నేత హరీశ్‌రావు వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు గుప్పించారు.మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరిలో నీరు ప్రవహిస్తున్నందున వెంటనే కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోవాలని బీఆరెస్ నేతలు, బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ చేస్తున్న డిమాండ్లను సీఎం తప్పుబట్టారు. ఈటెల రాజేందర్ వ్యక్తిగతంగా గౌరవనీయుడేనని, అయితే ఈ అంశంపై మాట్లాడే ముందు సాగునీటి శాఖ మంత్రి, ఎన్డీఎస్ఏ నిపుణులు, అధికారులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకుని ఉంటే ఆయన గౌరవం మరింత పెరిగేదని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు సూచనల మేరకే ఈటెల మాట్లాడుతున్నారని ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టును 2019 జూన్ 29న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారని గుర్తు చేసిన రేవంత్, ప్రారంభమైన 11 నెలలకే 2020 మే 18న మేడిగడ్డ బ్యారేజీలో లోపాలున్నాయని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవీ రమణారావు లేఖ రాశారని వెల్లడించారు. ఆ హెచ్చరికలను పట్టించుకోకపోవడం వల్లే సమస్యలు తీవ్రమై 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందన్నారు. మరుసటి రోజే ఇంజనీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు.ఈ ఘటన తర్వాత ఎన్డీఎస్ఏ నిపుణులు పరిశీలించి 2023 నవంబర్ 1న ప్రాథమిక నివేదిక ఇచ్చారని, ప్లానింగ్, డిజైన్, నిర్మాణం, నిర్వహణలో లోపాలున్నాయని అప్పుడే పేర్కొన్నారని చెప్పారు. అనంతరం పది నెలలపాటు సాంకేతిక పరీక్షలు, క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి తుది నివేదిక సమర్పించిందన్నారు.ఎన్డీఎస్ఏ తుది నివేదికలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలూ నీటి నిల్వకు అనుకూలం కాదని స్పష్టంగా పేర్కొన్నట్లు సీఎం వివరించారు. నివేదికలోని 346వ పేజీలో మేడిగడ్డ 7వ బ్లాక్ దెబ్బతినడంతో బ్యారేజీ ద్వారా నీటి మళ్లింపు సాధ్యం కాదని, 352వ పేజీలో అన్నారం బ్యారేజీ తీవ్రంగా దెబ్బతిన్నందున నీటి నిల్వ సురక్షితం కాదని, 356వ పేజీలో సుందిళ్ల బ్యారేజీ కూడా ప్రమాదకర స్థితిలో ఉందని వెల్లడించారని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ సమ్మరీలో కూడా మూడు బ్యారేజీలకు సమగ్ర పునరుద్ధరణ అవసరమని ఎన్డీఎస్ఏ సూచించిందన్నారు.పునరుద్ధరణ పనులు, డిజైన్లు, మరమ్మతులు అన్నీ ఎన్డీఎస్ఏ లేదా సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ఆమోదంతోనే చేపట్టాలని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారని సీఎం తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో గేట్లు మూసి నీటిని నిల్వ చేయడం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు.ప్రస్తుతం మేడిగడ్డ వద్ద నీటి ప్రవాహం ఉన్నప్పటికీ, కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన 93.50 మీటర్ల నీటిమట్టం లేదని సీఎం వివరించారు. ప్రస్తుతం నీటిమట్టం 89.90 మీటర్లే ఉందన్నారు. మేడిగడ్డ బెడ్ లెవల్ 88.50 మీటర్లు, క్రెస్ట్ లెవల్ 89.50 మీటర్లు మాత్రమేనని చెప్పారు. అన్నారం, సుందిళ్ల వద్ద కూడా ఇదే పరిస్థితి ఉందని, అక్కడ గేట్లు మూసి నీటిని నిల్వ చేయరాదని ఎన్డీఎస్ఏ ఇప్పటికే ఆదేశించిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో "నీళ్లు ఎత్తిపోసేయండి" అని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు.కాళేశ్వరం పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వం 2026 జూన్ 30న ప్రత్యేక సాంకేతిక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసిందని సీఎం తెలిపారు. మూడు బ్యారేజీల్లో నిర్మాణపరమైన సమస్యలు ఉన్నాయని ఆ కమిటీ కూడా గుర్తించిందన్నారు. పునరుద్ధరణకు సంబంధించిన ప్రతి నిర్ణయం, డిజైన్, నాణ్యత నియంత్రణ అంశాలు ఆ కమిటీ పర్యవేక్షణలోనే జరుగుతాయని చెప్పారు.బీఆరెస్ నాయకులపై విమర్శలు గుప్పించిన సీఎం, ప్రభుత్వం ఎన్డీఎస్ఏ సూచనల ప్రకారం పనిచేస్తుంటే, కేసీఆర్ నేతృత్వంలో "కిలాడీల కమిటీ" ఏర్పడిందని ఎద్దేవా చేశారు. ఆ కమిటీలో కేసీఆర్ చైర్మన్, హరీశ్‌రావు, కేటీఆర్ సభ్యులని, ఇప్పుడు ఈటెల రాజేందర్ కూడా చేరారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావుపై తీవ్ర విమర్శలు చేస్తూ, కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అవకతవకలకు ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈటెల రాజేందర్ ముందు తాను రెండు డిమాండ్లు పెడుతున్నానని సీఎం ప్రకటించారు. 2025 సెప్టెంబర్ 1న జీఓ నంబర్ 104 ద్వారా కేసును సీబీఐకి బదిలీ చేసినప్పటికీ, విచారణ ఇంకా వేగంగా సాగకపోవడంపై సమాధానం చెప్పాలని కేంద్రాన్ని ప్రశ్నించారు. కాళేశ్వరం పునరుద్ధరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఎన్డీఎస్ఏ మార్గదర్శకాల ప్రకారమే ముందుకు సాగుతుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్..

- తెలంగాణకు రూ.5 వేల కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయించాం
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటన

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**

తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన 'వికసిత్ భారత్–2047.. సాంకేతికత పాత్ర' సదస్సులో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డితో కలిసి పాల్గొన్న ఆయన తెలంగాణలో అమలవుతున్న రైల్వే అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మౌలిక సదుపాయాల విస్తరణపై విస్తృతంగా మాట్లాడారు. ముఖ్యంగా హైదరాబాద్‌ను చెన్నై, బెంగళూరుతో అనుసంధానించే బుల్లెట్ ట్రైన్ ప్రణాళికపై చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.దేశంలో ఆధునిక రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. రైల్వేలను కేవలం ప్రయాణ సాధనంగా కాకుండా దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అధునాతన సాంకేతికత, ప్రపంచస్థాయి ప్రమాణాలు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు.ఈ సందర్భంగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలను కలుపుతూ బుల్లెట్ ట్రైన్ కారిడార్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని వెల్లడించారు. దక్షిణ భారతదేశంలో పారిశ్రామిక, ఐటీ, విద్యా, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. వేగవంతమైన రైలు సేవలు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా మరింత వేగం పుంజుకుంటాయని తెలిపారు.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరిస్తూ రైల్వే బడ్జెట్‌పై కీలక వివరాలు వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే బడ్జెట్‌గా కేవలం రూ.880 కోట్లు మాత్రమే కేటాయించారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికే దాదాపు రూ.5 వేల కోట్ల మేర రైల్వే ప్రాజెక్టులపై ఖర్చు చేస్తోందని చెప్పారు. గతంతో పోలిస్తే రైల్వే రంగంలో పెట్టుబడులు ఎన్నో రెట్లు పెరిగాయని, ఈ నిధులతో కొత్త ప్రాజెక్టులు, లైన్ డబ్లింగ్, విద్యుదీకరణ, స్టేషన్‌ల ఆధునికీకరణ, భద్రతా చర్యలు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు.సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఆధునిక ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని విశాలమైన వెయిటింగ్ హాల్స్, అత్యాధునిక ప్లాట్‌ఫారాలు, మెరుగైన ఫుడ్ కోర్టులు, డిజిటల్ సమాచార వ్యవస్థలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, పార్కింగ్ సౌకర్యాలు, దివ్యాంగులకు అనుకూల వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ స్టేషన్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత దక్షిణ మధ్య రైల్వేలో ఒక కీలక కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న అమృత్ భారత్ స్టేషన్ పునరాభివృద్ధి కార్యక్రమం గురించి కూడా ఆయన వివరించారు. మొత్తం 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అందులో ఇప్పటికే 260 స్టేషన్ల పనులు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన స్టేషన్లలో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రయాణికులకు విమానాశ్రయ స్థాయి సౌకర్యాలు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.తెలంగాణలో కూడా రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. రాష్ట్రంలోని 40 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు కేంద్రం నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు. ఈ స్టేషన్లలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త సౌకర్యాలు, మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ సేవలు, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు అమలు చేస్తున్నామని తెలిపారు.రైల్వే రంగంలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరిస్తున్నామని మంత్రి వివరించారు.

# ఘనంగా బండి సంజయ్ బర్త్ డే వేడుకలు

- రాష్ట్రపతి, ప్రధాని, సీఎంసహా పలువురు మంత్రుల శుభాకాంక్షలు
- రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు
- ఆలయాల్లో పూజలు, రక్తదాన శిబిరాలు, పండ్ల పంపిణీ కార్యక్రమాలు

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి. రాధాక్రిష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులుసహా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు, వివిధ రాష్ట్రాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ''ప్రభుత్వంలో నా సహచరుడిగా, అలుపెరుగని కృషి, అపారమైన శక్తి, దృఢ సంకల్పంతో నవ భారత నిర్మాణం కోసం మీరు నిరంతరం శ్రమిస్తున్నారు. శనివారం రోజున మీ పుట్టిన రోజు సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో ఉండాలని కోరుకుంటున్నా.''అని పేర్కొంటూ బండి సంజయ్ కు లేఖ పంపారు. ''జన్మదినం అనేది జీవితం మనకు ప్రసాదించిన అమూల్యమైన అవకాశాల పట్ల కృతజ్ఞత వ్యక్తం చేసే ప్రత్యేక సందర్భం. కుటుంబం, సమాజం, దేశం పట్ల మన బాధ్యతలను మరింత నూతనోత్సాహంతో నిర్వర్తించేందుకు మనల్ని మనం పునరంకితం చేసుకోవడానికి ఇది స్ఫూర్తినిస్తుంది''అని ఆ లేఖలో పేర్కొన్నారు. ''దేశ అభివృద్ధి, శ్రేయస్సు కోసం మీరు చూపుతున్న అంకితభావం, నిబద్ధత ముఖ్యంగా యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. మీ జీవితం సంతోషం, శాంతి, సౌభాగ్యాలతో నిండాలని కోరుకుంటున్నాను. మీ జన్మదిన సందర్భంగా మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు.'' అని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం బండి సంజయ్ కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్ర, బీహార్ ముఖ్యమంత్రులు ఎ.రేవంత్ రెడ్డి, దేవేంద్ర ఫడ్నవీస్, సామ్రాట్ చౌదరి సైతం బండి సంజయ్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జైశంకర్, శివరాజ్ సింగ్ చౌహాన్, జి.కిషన్ రెడ్డి, శ్రీపాద్ వై నాయక్, లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రమోద్ సావంత్, మోహన్ యాదవ్, బీజేపీ తెలంగాణ ఇంఛార్జీలు సునీల్ బన్సల్, అభయ్ పాటిల్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ దంపతులు తదితరులు బండి సంజయ్ కు బర్త్ డే శుభాకాంక్షలు తెలిపారు.బండి సంజయ్ బర్త్ డేను పురస్కరించుకుని తెలంగాణవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞాలు, యాగాలు చేశారు. వేములవాడ రాజన్న సన్నిధిలో ప్రత్యేకంగా కోడె మొక్కు చెల్లించారు. మరోవైపు పుట్టిన రోజును పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ తమిళనాడులోని తుత్తుకూడు జిల్లా తిరుచందూర్ లో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం కేరళలోని పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# భూ రీసర్వేను అత్యంత ప్రాధాన్యతగా...

(మొదటి పేజీ తరువాయి)

భూ రీ–సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ఖమ్మం నుంచి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ సమీక్షలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, అయితే చట్టం అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని అంగీకరించారు. భూ భారతి సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ–సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ–సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని, శుక్రవారమే ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తుచేశారు.

**మార్చి 2027 నాటికి మూడు విడతల్లో..**

రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో భూ రీ–సర్వేను పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనిపై ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. తొలి విడతలో భాగంగా ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ–సర్వే చేపట్టినట్లు చెప్పారు. ఇందుకోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అయితే వీరికి ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. రీ–సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 కలిపి మొత్తం రూ.60 అందజేస్తామని, విధుల్లో చేరని వారికి గడువిచ్చి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు.

**సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణపై ఆరా...**

ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ.. అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని మంత్రి పేర్కొన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి, నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీ–సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ఒక సర్వే నంబరులో కొంత భూమిని ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత (22A) జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.


**గుడిసెల్లో నివసించే వారికే తొలి ప్రాధాన్యం...**

మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలన్నారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేయాలని, ఇందులో గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రానున్న ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా విద్యాశాఖ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

# డిప్యూటీ సీఎం సర్జరీ విజయవంతం

- సీఎం చంద్రబాబు నాయుడు ఆకాంక్ష
- త్వరగా కోలుకోవాలంటూ ఎక్స్ వేదికగా పోస్ట్

**ఆంధ్రప్రదేశ్ వెలుతురు జూలై 11:**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించి వస్తున్న వార్తలు ఆయన అభిమానులను, పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేసినప్పటికీ, తాజాగా అందుతున్న సమాచారం ఊరట నిస్తోంది. ముంబైలోని ప్రతిష్టాత్మకమైన కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో ఆయనకు వైద్యులు శనివారం విజయవంతంగా సర్జరీ నిర్వహించారు. గత కొంతకాలంగా భుజం నొప్పితో ఇబ్బంది పడుతున్న ఆయన, చివరకు వైద్యుల సూచన మేరకు ఈ సర్జరీ కోసం ముంబై వెళ్లారు. శుక్రవారం ముంబైకి చేరుకున్న ఆయనకు, వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, శనివారం ఉదయం ఆపరేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సర్జరీ సక్సెస్ కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.కుడి భుజానికి సంబంధించిన 'రొటేటర్ కఫ్' గాయాన్ని తొలగించేందుకు వైద్యులు ఈ శస్త్ర చికిత్సను చేపట్టారు. అత్యంత నిపుణులైన వైద్య బృందం పర్యవేక్షణలో సాగిన ఈ ఆపరేషన్ ప్రక్రియ సుమారు మూడున్నర గంటల పాటు కొనసాగింది. సర్జరీ అనంతరం ప్రస్తుతం పవన్ కళ్యాణ్ వైద్యుల పర్యవేక్షణలో రికవరీ గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. డిప్యూటీ సీఎం కార్యాలయం (డిప్యూటీ సీఎంవో) విడుదల చేసిన వివరాల ప్రకారం, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలుస్తోంది. ఆయన త్వరలోనే పూర్తిస్థాయిలో కోలుకుని ప్రజాక్షేత్రంలోకి వస్తారని వైద్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.నిజానికి పవన్ కళ్యాణ్ కుడి, ఎడమ రెండు భుజాలకు కూడా సమస్యలు ఉన్నాయని, అయితే రెండింటికీ ఒకేసారి ఆపరేషన్ చేయడం సాధ్యం కాదని వైద్యులు స్పష్టం చేశారు. రెండు భుజాలకు ఏకకాలంలో శస్త్ర చికిత్స నిర్వహించడం వల్ల నొప్పి తీవ్రత భరించలేని విధంగా ఉంటుందని, కోలుకోవడానికి కూడా ఎక్కువ సమయం పడుతుందని వారు సూచించారు. అందుకే, ఈసారి కుడి భుజానికి మాత్రమే సర్జరీ చేసి, ఆయన ఆరోగ్యం కుదుటపడిన తర్వాత, సుమారు రెండు నెలల వ్యవధిలో ఎడమ భుజానికి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ఈ ప్రణాళికాబద్ధమైన చికిత్స ద్వారా ఆయన భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పని చేసే అవకాశం ఉంటుందని వైద్య వర్గాలు పేర్కొన్నాయి.పవన్ కళ్యాణ్ శస్త్ర చికిత్సకు గురయ్యారన్న విషయం తెలియగానే ఏపీ రాజకీయాల్లోనే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఆయన అభిమానులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు. ముఖ్యంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన పట్ల తన ఆత్మీయతను చాటుకున్నారు. 'ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు త్వరగా, పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, ఈ సమయంలో ఆయనకు మనోధైర్యం కలగాలని కోరుకుంటున్నాను' అంటూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు కూడా ఆయనకు సంఘీభావం తెలుపుతూ త్వరగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.పవన్ కళ్యాణ్ ఈ భుజం సమస్యతో నిన్న మొన్నటి వరకు ఇబ్బంది పడటం లేదు. దీని వెనుక సుదీర్ఘ చరిత్ర ఉంది. 2016 సంవత్సరంలో ఆయనకు భుజాలకు గాయాలయ్యాయి. అప్పట్లో ప్రాథమిక చికిత్స తీసుకున్నప్పటికీ, పూర్తిస్థాయి విశ్రాంతి అవసరమని వైద్యులు అప్పట్లోనే హెచ్చరించారు. అయితే, రాజకీయంగా అప్పుడప్పుడే ఎదుగుతున్న దశలో ఉండటంతో ఆయన ఆ సూచనలను పెద్దగా పట్టించుకోలేదు. వరుస సమావేశాలు, పర్యటనలతో బిజీగా ఉండటం వల్ల ఆ గాయాలను ఆయన నిర్లక్ష్యం చేశారు. కాలక్రమేణా ఆ గాయాలు పాతబడి, తీవ్రమైన మజిల్ టేర్స్ (కండరాల చిరుగు) గా మారాయి.ఆయన గాయాలు తిరగబెట్టడానికి ప్రధాన కారణం ఆయన ప్రజల పట్ల చూపే ప్రేమ, అభిమానులు ఆయన పట్ల చూపే ఆరాధన. 2018లో జరిగిన 'పోరాట యాత్ర' సమయంలో, అభిమానులు ఆయనను కలిసేందుకు ఉత్సాహంగా చేతులు లాగేవారు, కరచాలనం చేసేవారు. అప్పుడు విపరీతమైన నొప్పి ఉన్నా, చిరునవ్వుతోనే భరించేవారు. అలాగే 2019 ఎన్నికల తర్వాత రాయలసీమలో, ఆ తర్వాత 2024 ఎన్నికల ప్రచారం, వారాహి యాత్రలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. జనాల మధ్య ఉన్నప్పుడు, అభిమానులు ఆప్యాయంగా హత్తుకోవడం, భుజాలపై చేయి వేయడం వంటి వాటివల్ల గాయం తీవ్రత మరింత పెరిగింది. అయినా, వారి ప్రేమను కాదనలేక ఆ నొప్పిని ఆయన మౌనంగా భరించారు.ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పవన్ కళ్యాణ్ ముక్కుకు సర్జరీ చేయించుకోవాల్సి వచ్చింది. ఆ సమయంలో ఆయనకు నిర్వహించిన సమగ్ర వైద్య పరీక్షల్లో, భుజాల పరిస్థితి దయనీయంగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. రొటేటర్ కఫ్ గాయాలు, కండరాల చిరుగు తీవ్ర స్థాయిలో ఉన్నాయని, వెంటనే ఆపరేషన్ చేయించుకోకపోతే భవిష్యత్తులో చేయి కదపడం కూడా కష్టమవుతుందని వైద్యులు హెచ్చరించారు. అప్పటికే ఎన్నికల సందడి, ప్రభుత్వం ఏర్పాటు, అధికారిక కార్యక్రమాల ఒత్తిడి ఉండటంతో, ఆయన ఆపరేషన్‌ను వాయిదా వేస్తూ వచ్చారు. ఆరోగ్యం కంటే ప్రజా బాధ్యతలే ముఖ్యమని భావించిన ఆయన తన పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారు.గత నెలలో కూడా వైద్యులు ఆయనకు ముంబైలో పరీక్షలు నిర్వహించి, వెంటనే సర్జరీ అవసరమని సూచించారు. కానీ అప్పుడు కూడా ఆయన వెనకడుగు వేశారు. తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని, తాను చేపట్టాల్సిన అధికారిక కార్యక్రమాలను పూర్తి చేయకుండా సర్జరీకి వెళ్లడం ఇష్టం లేక, పని ముగించుకుని వస్తానని వైద్యులకు మాట ఇచ్చి మరీ వచ్చారు. బాధ్యతల పట్ల ఆయనకున్న అంకితభావం ఎంతటిదో ఇది నిరూపిస్తోంది. ఇప్పుడు ఆ పనులన్నీ పూర్తి చేసుకుని, చివరకు తన ఆరోగ్యం కోసం సమయం కేటాయించారు. ఇప్పుడు జరుగుతున్న ఈ సర్జరీ ఆయనను తిరిగి ఆరోగ్యవంతునిగా మార్చి, మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేసే శక్తిని ఇస్తుందని పార్టీ వర్గాలు, అభిమానులు ఆశిస్తున్నారు.

# కేటీఆర్, హరీష్ రావులకు దమ్ముంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి..! ఇందిరమ్మ ఇండ్ల శీనన్న

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**



గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నాం కాబట్టే సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలతో పాటు బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజక వర్గాల ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది.ఐదేండ్ల పాలనకు ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారు. కానీ రెండున్నరేండ్లకే అసెంబ్లీని రద్దు చేయాలంటూ, ఉప ఎన్నికలంటూ ఉబలాటపడుతున్న కేటీఆర్, హరీష్ రావు ప్రజాపాలనపై మీరు చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉంటే, మీకు అంత దమ్ముంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలి.ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ పార్టీని ఫామ్‌హౌస్‌లో రాజకీయంగా బొంద పెట్టడం ఖాయం.

# దైవాలగూడ హత్యల ఘటనపై మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని దైవాలగూడలో చోటుచేసుకున్న దారుణ హత్యల ఘటనపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.రాజస్థాన్ పర్యటనలో ఉన్న మంత్రి సీతక్కకు ఘటన గురించి సమాచారం అందిన వెంటనే ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషితో ఫోన్‌లో మాట్లాడి సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో కూడా మంత్రి సీతక్క ప్రత్యేకంగా మాట్లాడారు. బాధిత కుటుంబానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని, మానసిక, సామాజిక పరమైన తోడ్పాటు కల్పించాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.ఇలాంటి అమానుష ఘటనలు సమాజాన్ని కలచివేస్తాయని పేర్కొన్న మంత్రి సీతక్క, మహిళలు, పిల్లలు, కుటుంబాల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నేరాలకు పాల్పడే వారెవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా దంపతులకు సన్మానం

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**





ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఒక సంతానం కలిగి తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను అనుసరిస్తున్న శ్రీమతి ఆలకుంట అనిత, శ్రీ నవీన్ కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డా. అనిత, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. శ్రీధర్, జిల్లా క్షయ నివారణ అధికారి డా. చల్లా దేవి, అడిషనల్ డీఎంహెచ్‌వో (ఎయిడ్స్/లెప్రసీ) డా. సరస్వతి, ప్రోగ్రామ్ అధికారులు డా. సాయిబాబా, డా. శ్రీకాళ, డా. ఆశ్రిత రెడ్డి, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, తల్లి–శిశు ఆరోగ్య పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైద్యాధికారులు సూచించారు.

# భారత ఐటీ పరిశ్రమ "ఏఐ యాజ్ ఎ సర్వీస్" దిశగా ముందుకు సాగాలి

- **ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత కింద భారత ఏఐ, సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ వృద్ధిలో హైదరాబాద్ పాత్ర కీలకం: కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్**

**హైదరాబాద్ వెలుతురు 11జులై:**





భారత్ సొంతమైన విశ్వసనీయ ప్రపంచ ఖ్యాతిని, నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను సద్వినియోగం చేసుకుంటూ... భారత ఐటీ పరిశ్రమ సాఫ్ట్‌వేర్ సేవల ఆధారిత నమూనా నుంచి "ఏఐ యాజ్ ఏ సర్వీస్" నమూనాకు మారాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వేలు, సమాచార, ప్రసార శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ పిలుపునిచ్చారు.హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హెచ్‌వైఎస్ఈఏ) ఆధ్వర్యంలో "వికసిత్ భారత్–2047 నిర్మాణంలో సాంకేతికత పాత్ర" అనే అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన ఇండస్ట్రీ లీడర్ టౌన్‌హాల్‌లో శ్రీ వైష్ణవ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమం అనంతరం పరిశ్రమ ప్రముఖులతో రౌండ్‌టేబుల్ చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ వైష్ణవ్‌తో పాటు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు.పరిశ్రమల ప్రముఖులనుద్దేశించి శ్రీ అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వికసిత్ భారత్–2047 దార్శనికతకు అనుగుణంగా కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో తయారీ, అధునాతన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా భారత తదుపరి దశ వృద్ధి సాధ్యమవుతోందన్నారు.ఐటీ పరిశ్రమను కృత్రిమ మేధ మౌలికంగా మార్చేసిందని పేర్కొంటూ... ప్రతీ కొత్త ఏఐ నమూనా కొత్త సామర్థ్యాలనూ, అవకాశాలనూ తీసుకువస్తుందన్నారు. పరిశ్రమలను అర్థం చేసుకోవడం, సమస్యలను గుర్తించడం, సమర్థమైన సాంకేతికత ఆధారిత పరిష్కారాలను అందించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా సంపాదించిన విశ్వాసమే భారత్ అతిపెద్ద బలమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.వ్యూహాత్మక మార్పు ఆవశ్యకతను ప్రధానంగా ప్రస్తావిస్తూ... భారత ఐటీ పరిశ్రమ ఇప్పుడు సాఫ్ట్‌వేర్–యాజ్–ఎ–సర్వీస్ నమూనాను దాటి, ఏఐని ఒక సేవగా అందించే (ఏఐ యాజ్ ఎ సర్వీస్) నమూనా దిశగా పరిణామం చెందాలని శ్రీ వైష్ణవ్ సూచించారు. పరిశ్రమల, విద్యాసంస్థల మధ్య సన్నిహిత సహకారంతో ఈ పరివర్తనను ముందుకు నడిపించాలని ఆయన కోరారు. ఇటీవలి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ... కృత్రిమ మేధలోని తాజా పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నాస్కామ్ ఒక సమగ్ర ఏఐ పాఠ్యప్రణాళికను అభివృద్ధి చేసిందని తెలిపారు. దానిని విద్యా మంత్రిత్వ శాఖ, ఏఐసీటీఈతో పంచుకున్నామని శ్రీ వైష్ణవ్ వివరించారు.సెమీకండక్టర్ల తయారీ రంగంలో దేశం సాధించిన పురోగతిని వివరిస్తూ, 1960ల నుంచే భారత్ ఒక సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించాలని ఆకాంక్షించిందన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రత్యేక కృషి వల్ల ఆ దార్శనికత ఇప్పుడు వాస్తవరూపం దాల్చిందని శ్రీ వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం 12 సెమీకండక్టర్ తయారీ ప్లాంట్లు వివిధ అభివృద్ధి దశల్లో ఉన్నాయని తెలిపారు. వాటిలో మూడు ప్లాంట్లు ఇప్పటికే జపాన్, యూరప్, దేశీయ మార్కెట్లకు ఎగుమతి అవుతున్న చిప్‌లను ఉత్పత్తి చేస్తున్నాయనీ ఆయన వివరించారు.దేశంలో అభివృద్ధి చెందుతున్న సెమీకండక్టర్ డిజైన్ వ్యవస్థ, దానికి తోడు ప్రపంచవ్యాప్తంగా నిపుణుల కొరత ఉండటం ఐటీ పరిశ్రమకు ముఖ్యమైన అవకాశాన్ని కల్పిస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. వినూత్నమైన సెమీకండక్టర్ పరిష్కారాలను రూపొందించడం కోసం ఎలక్ట్రానిక్స్, ఐటీ, డిజైన్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ రంగాల్లో తమకున్న బలాన్నీ, అనుభవాన్నీ ఉపయోగించుకోవాలని ఆయన కంపెనీలను ప్రోత్సహించారు. ప్రతిభావంతుల లభ్యతను బలోపేతం చేయడానికి ప్రభుత్వం 315 విశ్వవిద్యాలయాలకు అధునాతన సెమీకండక్టర్ డిజైన్ సాధనాలను అందుబాటులోకి తెచ్చిందనీ శ్రీ వైష్ణవ్ తెలిపారు.ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంపై శ్రీ వైష్ణవ్ మాట్లాడుతూ... ఈ రంగంలో భారత్ అపూర్వ వృద్ధిని సాధిస్తోందన్నారు. గత సంవత్సరం మొబైల్ ఫోన్లు దేశంలోనే అతిపెద్ద ఎగుమతి విభాగంగా ఆవిర్భవించాయని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం విలువ ప్రస్తుత రూ. 13 లక్షల కోట్ల నుంచి సమీప భవిష్యత్తులోనే రూ. 20 లక్షల కోట్లకు విస్తరిస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. ఒక్క తెలంగాణలోనే, కేంద్ర ప్రభుత్వం 104 ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీల ఏర్పాటుకు మద్దతునిచ్చిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. నాలుగు ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లనూ మంజూరు చేసిందనీ, ఒక కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ)నీ ఏర్పాటు చేసిందని ఆయన వివరించారు.

# ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే కుట్ర

- **కాళేశ్వరంపై బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం**
- **వాస్తవాలు ప్రజలకు చెబుతున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి**
- **మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల వ్యాఖ్యలు**
- **కాళేశ్వరంపై ఈటల అవాస్తవాలు చెప్పారని..**
- **ఆ వ్యాఖ్యలతో తన గౌరవం కోల్పోయారని విమర్శ**
- **మేడిగడ్డ లోపాలు కేసీఆర్ హయాంలోనే బయటపడ్డాయని స్పష్టీకరణ**
- **2020లోనే ఇంజినీర్లు హెచ్చరించినా బీఆర్ఎస్ పట్టించుకోలేదన్న ఆరోపణ**
- **నిర్లక్ష్యంతోనే లోపాలు పెరిగి మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని వ్యాఖ్య**
- **మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం ఎన్డీఎస్‌ఏ నివేదిక**

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**




ప్లానింగ్, డిజైన్, నిర్మాణం, నిర్వహణలో లోపాలున్నాయని విమర్శ

కేసీఆర్, హరీశ్‌రావు అబద్ధపు ప్రచారం మానుకోవాలని సీఎం సూచన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తమ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కలిసి దుష్ప్రచారం చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈటల చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, ఆయనపై తమకు వ్యక్తిగతంగా గౌరవం ఉన్నప్పటికీ ఆ వ్యాఖ్యలతో తన గౌరవాన్ని తానే తగ్గించుకున్నారని అన్నారు.శనివారం సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. 2019 జూన్ 21న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించారని గుర్తుచేశారు.ప్రాజెక్టు ప్రారంభమైన కొద్ది నెలల్లోనే మేడిగడ్డ బ్యారేజ్‌లో నిర్మాణ లోపాలు బయటపడ్డాయని సీఎం తెలిపారు. 2020 మే 18న అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణారెడ్డి ప్రభుత్వానికి లేఖ రాసి బ్యారేజ్‌లో ఉన్న లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని సూచించారని వెల్లడించారు. అప్పటికే ఇంజినీర్లు పలు సాంకేతిక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు.నిర్మాణంలో ఉన్న లోపాలను సకాలంలో సరిచేయకపోవడంతో సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చాయని సీఎం చెప్పారు. 2022 జూలై 14న వరదల కారణంగా కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని, ఇప్పటి వరకు అది పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదని పేర్కొన్నారు. అనంతరం 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం ప్రాజెక్టులోని లోపాలను బహిర్గతం చేసిందని అన్నారు.మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటు ఘటన తర్వాత కాదు, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్డీఎస్‌ఏ) కమిటీని ఏర్పాటు చేశారని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలంగా లేవని ఎన్డీఎస్‌ఏ తన ప్రాథమిక, తుది నివేదికల్లో స్పష్టంగా పేర్కొందని తెలిపారు. ప్రాజెక్టు ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణలో తీవ్ర లోపాలు ఉన్నాయని నిపుణుల కమిటీ తేల్చిందని చెప్పారు.ఎన్డీఎస్‌ఏ నివేదికలో సూచించిన లోపాలను సరిచేయాలని నిపుణులు పదేపదే సూచించినప్పటికీ అప్పటి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని సీఎం ప్రశ్నించారు. ప్రారంభ దశలోనే సమస్యలను పరిష్కరించి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదని అన్నారు. అధికారుల హెచ్చరికలు, నిపుణుల సూచనలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రాజెక్టుకు నష్టం వాటిల్లిందని ఆరోపించారు.ప్రస్తుతం తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అంశాన్ని పారదర్శకంగా ప్రజల ముందుకు తీసుకొస్తోందని సీఎం తెలిపారు. వాస్తవాలను దాచిపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అంశంలో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తిప్పికొడుతుందని చెప్పారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అసత్య ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వాస్తవాలను ప్రజలకు వివరించడం తమ బాధ్యత అని, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో నిజానిజాలు బయటపెట్టేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని స్పష్టం చేశారు.

# యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖగారు

- **దేవస్థానికి వచ్చిన మంత్రిగారికి పూర్ణకుంభం స్వాగతం పలికిన అర్చకులు, పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి**
- **ఛైర్మన్, సభ్యుల ప్రమాణస్వీకారం తర్వాత వారికి శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి సురేఖ గారు**
- **యాదగిరి గుట్ట దేవస్థానాన్ని దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా, రాష్ట్రానికి తలమానికంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని నూతన ట్రస్ట్ బోర్డుకు సూచించిన మంత్రి**
- **యాదగిరిగుట్ట దేవస్థానానికి తొలి పాలకమండలిగా ఛైర్మన్, సభ్యులు పై వుండే అంచనాలకు అనుగుణంగా పనిచేయాలని వారికి సూచించిన మంత్రి సురేఖ**

**యాదగిరిగుట్ట వెలుతురు జూలై 11:**





ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆశయాల మేరకు యాదగిరిగుట్టను దేశంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండాసురేఖ గారు యాదగిరిగుట్ట నూతన పాలకమండలికి సూచించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం దేవస్థానం ఖ్యాతిని మరింత పెంచే బాధ్యత నూతన పాలక మండలిపై ఉందని వారు పాలకమండలికి దిశానిర్దేశం చేశారు. శనివారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి కొండా సురేఖగారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ట్రస్ట్ బోర్డు ఎక్స్ అఫీషియో సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.దేవస్థానానికి చేరుకున్న మంత్రిగారికి ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్ని తర్వాత వేదపండితులు మంత్రి సురేఖ గారికి వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఈవో భవానీ శంకర్ మంత్రి సురేఖ గారికి లక్ష్మీ సమేత నరసింహస్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. ఛైర్మన్ ఎం. సత్యనారాయణ రెడ్డితో పాటు హాజరైన పాలక మండలి సభ్యులు ఆలయ ముఖమండపం ప్రాంగణంలో మంత్రి సురేఖ గారి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి, అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా మంత్రి సురేఖగారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందిస్తూ, దేశవ్యాప్తంగా భక్తులకు ఆదర్శ క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు నూతన పాలక మండలి సమిష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఛైర్మన్, సభ్యులు అంకితభావంతో పనిచేస్తూ ఆలయ అభివృద్ధి, పారదర్శక పాలన, భక్తులకు మరిన్ని సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఆలయ పవిత్రత, సంప్రదాయాలను కాపాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని, పాలక మండలి సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి దేవస్థానం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

# విద్యలో పెట్టుబడి అంటే భావితరాల భవిష్యత్తులో పెట్టుబడి

విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాదు, సమాజ ప్రగతికి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, దేశ భవిష్యత్తుకు కూడా మూలాధారం. భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన విద్యావకాశాలను కల్పించాలనే లక్ష్యంతో సామాజిక న్యాయ స్ఫూర్తిని ప్రతిష్ఠించింది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వం ప్రత్యేక బాధ్యత తీసుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు కేవలం సంక్షేమ కార్యక్రమాలు మాత్రమే కాదు,అవి సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజ్యాంగ విలువలను ఆచరణలో నిలబెట్టిన చారిత్రాత్మక సంస్కరణలు. ఈ పథకాల ద్వారా లక్షలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, న్యాయశాస్త్రం, డిగ్రీ, పీజీ, నర్సింగ్, మేనేజ్‌మెంట్, ఇతర వృత్తి విద్యా కోర్సులను అభ్యసించి దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించారు. చదువుతో ఒక్క విద్యార్థి మాత్రమే కాదు, అతని కుటుంబం, తదుపరి తరం కూడా పేదరికం నుంచి బయటపడగలదని ఈ పథకం స్పష్టంగా నిరూపించింది.

ఒక కుటుంబంలో ఒకరు ఉన్నత విద్యను పూర్తి చేసి స్థిరమైన ఉద్యోగం సాధిస్తే ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారుతుంది. కుటుంబ ఆదాయం పెరుగుతుంది. అప్పుల భారం తగ్గుతుంది. తల్లిదండ్రులకు భరోసా లభిస్తుంది. తదుపరి తరానికి మెరుగైన విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు అందుబాటులోకి వస్తాయి. ఈ విధంగా విద్య ఒక వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబాన్ని, సమాజాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తిగా మారుతుంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా విద్యను పేదరిక నిర్మూలనకు అత్యంత శక్తివంతమైన సాధనంగా గుర్తిస్తున్నారు. ప్రభుత్వం విద్యపై చేసే ప్రతి రూపాయి ఖర్చు వ్యయం కాదు, అది మానవ వనరుల అభివృద్ధిపై, రాష్ట్ర భవిష్యత్తుపై చేసే అత్యంత విలువైన పెట్టుబడి.

2008లో ప్రారంభమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం భారత సంక్షేమ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన విద్యా సంస్కరణలలో ఒకటిగా నిలిచింది. పేదరికం కారణంగా ఉన్నత విద్యకు దూరమవుతున్న లక్షలాది మంది విద్యార్థులకు ఈ పథకం ఆశాకిరణంగా మారింది. గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ కూలీలు, చిన్న రైతులు, కార్మికులు, చిరు వ్యాపారుల కుటుంబాలకు చెందిన యువత వైద్యులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు అధికారులు, ఐటీ నిపుణులు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దడంలోనూ, పరిశ్రమలు, ఫార్మా, బయోటెక్నాలజీ, సేవారంగం, స్టార్టప్‌ల అభివృద్ధికి అవసరమైన నైపుణ్య మానవ వనరులను అందించడంలోనూ ఈ పథకం కీలక పాత్ర పోషించింది. ఈ అభివృద్ధి వల్ల రియల్ ఎస్టేట్, రవాణా, ఆరోగ్యం, విద్య, సేవారంగం వంటి అనుబంధ రంగాలు కూడా విస్తరించాయి. రాష్ట్ర ఆదాయం, ఉపాధి అవకాశాలు, తలసరి ఆదాయం పెరగడంలో కూడా ఈ పథకం పరోక్షంగా విశేష పాత్ర పోషించిందని చెప్పడం అతిశయోక్తి కాదు.

ఈ పథకం ప్రభుత్వాల దయాదాక్షిణ్యంతో అమల్లోకి వచ్చినది కాదు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో జరిగిన ఉద్యమాల ఫలితమే ఇది. ముఖ్యంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య చేపట్టిన దీర్ఘకాల ఉద్యమం, అమరణ నిరాహార దీక్షకు స్పందించిన ప్రభుత్వమే ఈ పథకాన్ని అమలు చేసింది. "చదువే పేదరిక నిర్మూలనకు మార్గం" అనే సామాజిక తత్వానికి ఈ పథకం ప్రతీకగా నిలిచింది. అందువల్ల దీనిని సాధారణ సంక్షేమ పథకంగా కాకుండా సామాజిక హక్కుగా చూడాల్సిన అవసరం ఉంది.

అయితే ఇటీవలి కాలంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో చోటుచేసుకున్న జాప్యం విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు వేల కోట్ల రూపాయలకు చేరినట్లు వెల్లడవుతోంది. ప్రభుత్వ నిధులు సమయానికి విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక చదువులు మధ్యలో నిలిపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కళాశాలలు ప్రభుత్వ చెల్లింపుల కోసం ఎదురుచూస్తూ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని నిర్వహణ కొనసాగించాల్సి వస్తోంది. అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించడం కష్టమవుతోంది. ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్వహణ కూడా ప్రభావితమవుతోంది. దీని ప్రభావం నేరుగా విద్యా నాణ్యతపై పడుతోంది.

ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ప్రభుత్వ బకాయిలు విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నత విద్య, విదేశీ విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అవకాశాలను కోల్పోతున్నారు. ఒక విద్యార్థి భవిష్యత్తు అనిశ్చితిలో పడితే, దాని ప్రభావం అతని కుటుంబంపైనే కాదు, సమాజంపైనా పడుతుంది. చదువు ఆగిపోవడం వల్ల నిరుద్యోగం పెరుగుతుంది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత ఏర్పడుతుంది. సామాజిక అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం "బడ్జెట్ లేదు" అనే కారణాన్ని చూపడం సమంజసంగా కనిపించదు. ప్రతి సంవత్సరం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్ కేటాయించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన, పరిపాలనా బాధ్యత. రాష్ట్ర ఖజానాకు పన్నుల రూపంలో, కేంద్ర నిధుల రూపంలో, భూముల విక్రయాల ద్వారా, ఇతర ఆర్థిక వనరుల ద్వారా భారీ ఆదాయం సమకూరుతున్నప్పుడు, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నిధులను మాత్రమే విడుదల చేయలేకపోవడం ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇతర రంగాలకు, అభివృద్ధి పనులకు, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు నిధులు విడుదల చేస్తున్న సమయంలో విద్యార్థుల సంక్షేమ పథకాలు పెండింగ్‌లో ఉండటం విద్యపై ప్రభుత్వ ప్రాధాన్యతపై సందేహాలు కలిగిస్తోంది.

ఈ పరిస్థితి ఒక్కసారిగా ఏర్పడలేదు. ప్రతి సంవత్సరం అవసరమైన నిధులను క్రమం తప్పకుండా విడుదల చేయకపోవడం వల్లే బకాయిలు పేరుకుపోయాయి. వార్షిక బడ్జెట్‌లో ముందుగానే తగిన నిధులు కేటాయించి, త్రైమాసికం లేదా ఆరు నెలలకొకసారి విడతల వారీగా విడుదల చేసి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ప్రణాళికాబద్ధమైన ఆర్థిక నిర్వహణ ఉంటే కళాశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇంతటి ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన అవసరం ఉండేది కాదు. అందువల్ల భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా శాశ్వత ఆర్థిక విధానాన్ని ప్రభుత్వం రూపొందించాల్సిన అవసరం ఉంది.

ఇటీవల తీసుకొచ్చిన జీవో నెం.9 కూడా విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థుల ఖాతాల్లో జమ చేసి, నిర్దిష్ట గడువులోపు కళాశాలలకు చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తీసుకుంటామని పేర్కొనడం సంక్షేమ పథకాల అసలు లక్ష్యానికి విరుద్ధంగా కనిపిస్తోంది. పేద విద్యార్థులు ఉద్దేశపూర్వకంగా ఫీజులు చెల్లించకుండా ఉండరు. వారికి ఆర్థిక, సాంకేతిక, పరిపాలనా సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో వారిపై శిక్షాత్మక నిబంధనలు విధించడం కంటే, వారికి అనుకూలమైన పరిపాలనా విధానాన్ని రూపొందించడం ప్రభుత్వ బాధ్యత. గతంలో అమలులో ఉన్న విధంగా ప్రభుత్వం నేరుగా కళాశాలల ఖాతాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తే పారదర్శకత, సౌలభ్యం రెండూ పెరుగుతాయి. అందువల్ల జీవో నెం.9లోని వివాదాస్పద నిబంధనలను ప్రభుత్వం పునఃసమీక్షించడం సముచితంగా ఉంటుంది.పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న విధానాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అక్కడ అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో దశలవారీ చెల్లింపుల విధానం కొనసాగుతోందని ప్రభుత్వం పేర్కొంటోంది. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా, కళాశాలలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా నిధులు విడుదల చేసే వ్యవస్థపై దృష్టి సారిస్తోంది. మంచి పరిపాలన అంటే ఇతర ప్రాంతాల్లో అమలవుతున్న సమర్థవంతమైన విధానాలను అధ్యయనం చేసి ప్రజల ప్రయోజనాల కోసం స్వీకరించడం. విద్యార్థుల సంక్షేమం రాజకీయాలకు అతీతమైన అంశం కావడంతో, ఉపయోగకరమైన విధానాలను తెలంగాణలో కూడా అమలు చేయడం అవసరం.విద్యలో పెట్టుబడి పెట్టడం అంటే కేవలం వ్యక్తిగత అభివృద్ధికే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికీ దోహదపడటం. చదువుకున్న యువత పరిశ్రమలు స్థాపిస్తారు, కొత్త ఆవిష్కరణలు చేస్తారు, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు, పన్నులు చెల్లించి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతారు. విద్యార్థి విజయం కుటుంబ విజయంగా, కుటుంబ విజయం సమాజ విజయంగా, సమాజ విజయం రాష్ట్ర విజయంగా మారుతుంది. అందుకే "స్కాలర్‌షిప్ అంటే దానం కాదు – అది రాజ్యాంగబద్ధమైన సామాజిక న్యాయం" అనే భావనను ప్రభుత్వం ఆచరణలో నిరూపించాలి.అదే సమయంలో ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజం అందరూ కలిసి "ఏ పేద విద్యార్థి కూడా ఆర్థిక కారణాలతో చదువు మానేయకూడదు" అనే లక్ష్యంతో పనిచేయాలి. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. ప్రతి సంవత్సరం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, త్రైమాసిక ప్రాతిపదికన నిధులు విడుదల చేసే శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఎన్నికల హామీల ప్రకారం అర్హులైన విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి. ప్రభుత్వమే నేరుగా కళాశాలలకు నిధులు విడుదల చేసే విధానాన్ని పునరుద్ధరించాలి. విద్యార్థులపై అదనపు పరిపాలనా, చట్టపరమైన భారం మోపకుండా వారికి భరోసా కల్పించాలి.

చివరగా ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. రోడ్లు, భవనాలు, వంతెనలు కాలక్రమేణా పాతబడవచ్చు. కానీ విద్యపై పెట్టిన పెట్టుబడి తర తరాలకు ఫలితాలను అందిస్తుంది. నేడు చదువుతున్న విద్యార్థులే రేపటి వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, న్యాయమూర్తులు, ఉపాధ్యాయులు, పరిపాలకులు, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు. వారి విద్యకు ఆటంకం కలిగితే రాష్ట్ర భవిష్యత్తుకే ఆటంకం ఏర్పడుతుంది. అందువల్ల విద్యను వ్యయంగా కాకుండా అభివృద్ధికి మూలధనంగా ప్రభుత్వం చూడాలి. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే సమాన విద్యావకాశాలు, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి సాధ్యమవుతాయి. విద్యార్థిని కాపాడితేనే భావితరాలు వెలుగొందుతాయి. విద్యను కాపాడితేనే సమాజం బలపడుతుంది. విద్యలో పెట్టుబడి అంటే రాష్ట్ర అభివృద్ధిలో పెట్టుబడి. అదే నిజమైన సంక్షేమం, అదే శాశ్వత అభివృద్ధికి పునాది.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# మమకారమే మనిషికి మధుర బందిఖానా!

మనిషి సామాజిక జీవి. పుట్టుకతోనే అతను ఒక అదృశ్య బంధీగా మారుతున్నాడు. మాతృగర్భంలో తొమ్మిది నెలల జీవన ప్రయాణం ముగించి, ఇలపైన అడుగుపెట్టిన క్షణం నుంచే ఆ పసిగుండె చుట్టూ ఒక అనిర్వచనీయమైన భావోద్వేగ దారం అల్లుకుపోతుంది. ఆ అదృశ్య సూత్రానికే మమత అని పేరు. ఇది కంటికి కనిపించని సంకెళ్ల వంటిది. చేతులకు తగలదు, కాళ్లకు అడ్డురాదు. కానీ, అంతరంగాన్ని మాత్రం ఎంత దూరం పారిపోయినా వెంటాడే ఒక మధుర బందిఖానాగా మారుస్తుంది. అందుకే లోకోక్తిగా చెబుతుంటారు.. మమకారమే మనిషికి అసలైన బందిఖానా అని! మారుతున్న ఆధునిక కాలంలో, యాంత్రిక జీవన స్రవంతిలో ఈ అనుబంధాల విలువ ఎంతవరకు నిలిచింది? మనిషి స్వేచ్ఛకు, బాధ్యతకు మధ్య సాగుతున్న సంఘర్షణ ఏమిటనేది నేడు సమాజం ముందున్న అతిపెద్ద ప్రశ్న.ఆధునిక జీవితంలో ఎన్నోసార్లు మనిషి ఈ బంధాల పరిధి నుంచి తప్పించుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తుంటాడు. లౌకిక బాధ్యతల భారం మోయలేక, తను ప్రేమించిన వారి కష్టాలు చూడలేక, కన్నవారి కళ్లలో నిరాశను భరించలేక ఒక్కోసారి సుదూర తీరాలకు పారిపోవాలనే వైరాగ్యం కలగడం సహజం. ఉద్యోగ ఉపాధుల కోసమో, సొంత అస్తిత్వం, స్వేచ్ఛ కోసమో, వ్యక్తిగత కలల సాకారం కోసమో కన్న ఊరును, కట్టుకున్నవారిని వదిలి వెళ్లిన ప్రతి ఒక్కరికీ ఈ మానసిక అనుభవం ఎదురవుతూనే ఉంటుంది.కానీ ఎంత దూరం వెళ్లినా, ఎన్ని సముద్రాలు దాటినా, మానవ మనస్సు మాత్రం నిరంతరం భూతకాలపు జ్ఞాపకాల వైపే వెనక్కి తిరిగి చూస్తూ ఉంటుంది. తల్లి వండిన అమృతుల్యమైన కూర రుచి, కన్నతండ్రి మౌనంగా వెన్నుతట్టి ఇచ్చిన ధైర్యం, తోబుట్టువుల నిర్మలమైన నవ్వులు, స్నేహితుల అండదండలు ఇవన్నీ ఒక్కొక్క పాశంలా మనిషిని వెనక్కి లాగుతూనే ఉంటాయి. భయపడి ఆ బంధాలను తెంచుకున్నామనుకున్న ప్రతిసారీ, తెలియని ఆ మానసిక అనుబంధం మళ్లీ వెంటపడి, నువ్వు తీసుకున్న రుణాన్ని తీర్చుకోక తప్పదు అని అంతరాత్మను హెచ్చరిస్తూనే ఉంటుంది.ఈ సృష్టిలో బంధాల రుణం అనేది డబ్బుతోనో, సంపదతోనో కొలవగలిగేది కాదు. ఇది ప్రేమకు ప్రతిప్రేమను, కష్టానికి తోడును, కన్నీటికి ఓదార్పు భుజాన్ని ఇచ్చుకుంటూ తీర్చుకోవాల్సిన అమూల్యమైన ఋణం. శైశవదశలో తల్లి భుజం మీద సేదతీరిన బిడ్డ, వృద్ధాప్యంలో అదే తల్లికి ఆసరాగా భుజం అందించాల్సిన సమయం వస్తుంది. ఇదే ప్రకృతి ధర్మం, ఇదే కాలచక్రం. మమత నేర్పే పరమార్థం కూడా ఇదే. నీ భుజం మార్చుకో అని కాలం మనిషిని ఆదేశిస్తుంది. అంటే, ఒకప్పుడు నిన్ను అక్కున చేర్చుకుని మోసిన వారిని, ఇప్పుడు నువ్వు గుండెలకు హత్తుకుని మోయాల్సిన వంతు వచ్చిందని అర్థం. ఇది బాహ్య ప్రపంచానికి భారంగా అనిపించినా, నిజానికి ఇదే మానవ జీవితానికి సముచిత అర్థాన్నిచ్చే గొప్ప సామాజిక బాధ్యత.ప్రస్తుత సమాజంలో ఎంతోమంది ఈ బంధాలను ఒక భారంగా, స్వేచ్ఛకు నిరోధకంగా భావిస్తూ, వాటిని తెంచుకుని ఒంటరిగా బతకాలని తాపత్రయపడుతున్నారు. అయితే, నిజమైన స్వేచ్ఛ అంటే బంధాలను నిరాకరించడం కాదు, వాటి అంతరార్థాన్ని గ్రహించి హృదయపూర్వకంగా నిర్వర్తించడంలోనే ఉందనే సత్యాన్ని విస్మరిస్తున్నారు. కన్నవారిని వృద్ధాశ్రమాల పాలు చేసి, తాము మాత్రం విలాసవంతంగా బతకాలనుకునే వికృత పోకడలు నేటి సమాజంలో కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. కానీ ఆ కఠిన నిర్ణయం తీసుకునే క్షణంలో వారు ఒక ప్రాథమిక సత్యాన్ని మర్చిపోతున్నారు. తాము కూడా రేపు అదే వృద్ధాప్య స్థితిలో నిలబడక తప్పదని గ్రహించలేకపోతున్నారు. మమకారమనేది ఒక ఆవర్తన చక్రం. మనం సమాజానికి ఏమి ఇస్తామో, అదే మళ్లీ మనకు తిరుగుటపాలో వస్తుంది. ఎవరైతే ఆ బంధాల పవిత్రతను గౌరవిస్తారో, వారికే జీవితం అత్యంత అర్థవంతంగా సాగుతుంది.సాహిత్యంలో, చలనచిత్ర మాధ్యమాలలో, జానపద గేయాలలో ఈ మమత గురించిన సామాజిక భావన ఎన్నోసార్లు అద్భుతంగా ప్రతిఫలించింది. ఎందుకంటే ఇది ప్రతి మనిషి హృదయాన్ని స్పృశించే నిత్య సత్యం. కోట్లు సంపాదించాలని, కీర్తిప్రతిష్ఠలు గడించాలని ఎంతలా పరుగెత్తినా, చివరికి మనిషి ప్రశాంతత కోసం వెతుక్కునేది ఆ మమతాను రాగాల నీడనే. ఒంటరితనంలో ఉన్నప్పుడు స్మరణకు వచ్చేది తనను ప్రేమించిన వారి ముఖారవిందాలే. అనారోగ్యం పాలైనప్పుడు తలుచుకునేది కన్నవారి ఆప్యాయతనే. అందుకే ఈ భావోద్వేగ బందిఖానా నిజానికి శిక్ష కాదు, అదొక అభయహస్తం. మనిషిని తీవ్రమైన ఒంటరితనం, మానసిక కుంగుబాటు నుంచి కాపాడే రక్షణ కవచం ఇది.మనం నిత్య జీవితంలో చూసే ఎన్నో దృశ్యాలు దీనికి ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తాయి. రైలు కిటికీలో నుంచి కన్నీళ్లు తుడుచుకుంటూ జీవనోపాధి కోసం ఊరు వదిలి వెళ్లే యువకుడు, ఎంత సుదూర ప్రాంతంలో ఉన్నా ప్రతి పండుగకూ కన్నవారిని చూడటానికి పరుగెత్తుకు వచ్చే కూతురు, తండ్రి అనారోగ్యవార్త విన్న వెంటనే తన పనులన్నీ పక్కనబెట్టి బయలుదేరే కొడుకు వీరంతా ఆ మమతా పాశానికి స్వచ్ఛందంగా తలవంచిన వారే. ఇది మానసిక బలహీనత కాదు, మనిషిలోని అత్యున్నత సంస్కారానికి నిదర్శనం. యంత్రాలకు ఈ బంధాలు తెలియవు, కేవలం భౌతిక సంపదకు ఈ విలువలు అర్థం కావు. రక్తసంబంధాల్లో, స్నేహబంధాల్లో, ఆత్మీయ అనుబంధాల్లో మాత్రమే ఈ పాశం జీవం పోసుకుంటుంది. అందుకే మమతను, మానవత్వాన్ని కోల్పోయిన మనిషి ఎంతటి కుబేరుడైనా, అంతరంగంలో అత్యంత దరిద్రుడే అవుతాడు.నేటి తరం యువత విదేశీ వ్యామోహంలో పడి, సొంత సామ్రాజ్యాలు నిర్మించుకుంటూ, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను దూరం చేసుకుంటున్న సంఘటనలు నిత్యం చూస్తూనే ఉన్నాం. ఆధునికత, ప్రపంచీకరణ పేరుతో రక్తసంబంధాలను తేలికగా తీసుకునే సంస్కృతి పెరుగుతోంది. కానీ కాలం గడిచేకొద్దీ, ఆ మానసిక ఖాళీతనం అంతరంగాన్ని పట్టి పీడిస్తుంది. అప్పుడు కానీ అర్థం కాదు మమత అనేది జీవితానికి భారం కాదు, అది ప్రాణవాయువు అని! ఆ అనుబంధాల సమాహారం లేకపోతే మనిషి కేవలం జీవచ్ఛవంలా బతుకుతాడు కానీ, హృదయంతో బతకలేడు.భారతీయ గ్రామాల్లో ఇప్పటికీ ఈ మమత, ఆత్మీయత సజీవంగా కనిపిస్తాయి. పండుగలు, పబ్బాలకు కుటుంబాలన్నీ ఒకచోట చేరడం, పెద్దల ఆశీస్సులు అందుకోవడం, పొరుగువారి కష్టసుఖాల్లో భాగస్వాములు కావడం ఇవన్నీ గ్రామీణ సంస్కృతిలోని బంధాల బలాన్ని చాటుతాయి. కానీ నగరాల్లో, ఉరుకుల పరుగుల యాంత్రిక జీవితంలో ఈ అనుబంధాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. సమాచార సాంకేతికత పెరిగి ఫోన్లలో మాట్లాడే మాటలు పెరిగినా, హృదయాలను హత్తుకునే ప్రత్యక్ష స్పర్శ కరువైపోతోంది. ఆర్థిక అవసరాలు, హోదా, తీవ్రమైన పోటీతత్వం మనుషుల మధ్య అంతరాలను పెంచుతున్నాయి. ఇలాంటి సంక్షోభ పరిస్థితుల్లోనే మమత విలువ మరింత స్పష్టంగా అర్థమవుతుంది. ఎందుకంటే డబ్బుతో భౌతిక సుఖాలు కొనగలం కానీ, నిజమైన తోడును కొనలేం. హోదాతో తాత్కాలిక గౌరవం సంపాదించగలం కానీ, శాశ్వతమైన ప్రేమను సంపాదించలేం.ఒక వృద్ధురాలైన తల్లి తన కొడుకు రాక కోసం ఎదురుచూసే కళ్లలో ఉన్న ఆర్తి, ఒక తండ్రి తన కూతురి వివాహం కోసం రక్తాన్ని చెమటగా మార్చి కూడబెట్టిన కష్టార్జితంలో ఉన్న త్యాగం, ఒక అన్న తన తోబుట్టువుల భవిష్యత్తు కోసం వదులుకున్న సొంత కలలు ఇవన్నీ మమత అనే బందిఖానా గోడల మీద చెక్కబడిన సువర్ణాక్షరాలు. ఈ గోడలు మనిషిని బంధించి హింసించవు, బదులుగా అతనికి సమాజంలో ఒక సముచిత గుర్తింపునిస్తాయి. ఆ విశిష్ట గుర్తింపే మనిషిని సమాజంలో సగర్వంగా నిలబెడుతుంది. లేకపోతే, అపరిమిత స్వేచ్ఛ పేరుతో ఒంటరిగా జీవించే మనిషి కేవలం ఒక నిర్జన ద్వీపంలా మిగిలిపోతాడు. అతని చుట్టూ ఎంత సంపద ఉన్నా, అతని మనస్సు మాత్రం శూన్యంగానే మిగులుతుంది.అందుకే జీవిత ప్రయాణంలో ఎప్పుడైనా ఈ బంధాల నుంచి విముక్తి పొందాలనే ఆలోచన వచ్చినప్పుడు, ప్రతి ఒక్కరూ ఒక్క క్షణం ఆగి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఈ పాశం మనల్ని ఎందుకు వెంటాడుతోందో, ఈ రుణాన్ని ఎవరికి చెల్లించాలో ఆలోచించాలి. ఆ ప్రశ్నలకు సరైన సమాధానం దొరికినప్పుడు, పారిపోవాలనే ఆవేశం మాయమై, తిరిగి వెళ్లి కన్నవారి భుజాన్ని పంచుకోవాలనే ఆరాటం మొదలవుతుంది. ఇదే మమత యొక్క అసలైన గొప్పతనం. ఇది మనిషిని బలహీనుడిగా మార్చదు, బదులుగా అతని లోపల నిద్రిస్తున్న మానవత్వాన్ని మేల్కొల్పుతుంది.కాబట్టి, ఈ మమకారాన్ని ఒక బందిఖానాగా భావించకుండా, ప్రకృతే ప్రసాదించిన వరంగా స్వీకరించడం నేర్చుకోవాలి. తల్లిదండ్రుల రుణం, తోబుట్టువుల అనుబంధం, ఆత్మీయుల తోడు వీటన్నింటినీ ఒక బరువుగా కాకుండా, జీవితాన్ని సుసంపన్నం చేసే అమూల్యమైన సంపదగా గుర్తించాలి. ఎవరైతే ఈ మానవతా బంధాలను గౌరవించి, తమ వంతు సామాజిక, కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తారో, వారి జీవితమే నిజంగా సార్థకమవుతుంది. కాలగమనంలో చివరికి మిగిలేది భౌతిక సంపద కాదు, హోదాలు కావు,మనం ఇతరులకు పంచిన స్వచ్ఛమైన ప్రేమ, మనం తీర్చిన రుణం మాత్రమే. అదే మానవ జీవిత పరమార్థం. మమతే మనిషికి బందిఖానా అయినా, అదే బందిఖానా మనిషిని సమాజంలో బాధ్యతాయుతమైన మనిషిగా నిలబెడుతుంది. ఈ పరమసత్యాన్ని గ్రహించిన నాడే, మానవ జీవన గమనానికి నిజమైన సార్థకత చేకూరుతుంది. బంధాలను వీడిన శూన్య స్వేచ్ఛ కంటే, బంధాలతో కూడిన సామాజిక బాధ్యతే అత్యున్నతమైనదని తెలుసుకున్న క్షణమే, మనిషి సంపూర్ణ మానవుడిగా రూపాంతరం చెందుతాడు.





డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher,9490754169

# రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా ఎగరాలి

- వీరమహిళ తనూజ రెడ్డి
- శంకర్‌పల్లి మండల కార్యకర్తల సమావేశం విజయవంతం
- సర్, స్థానిక ఎన్నికలపై కార్యకర్తలకు అవగాహన



**శంకర్‌పల్లి, వెలుతురు జూలై 11:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున బలమైన నాయకత్వాన్ని తయారు చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర జనసేన వీరమహిళ తనూజ రెడ్డి పిలుపునిచ్చారు. శంకర్‌పల్లి మండల కేంద్రంలో సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండల జనసేన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తనూజ రెడ్డి.. SIR (సమాచార సేకరణ) మరియు రాబోయే స్థానిక ఎన్నికల వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తనూజ రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా గ్రామాల వారీగా కొంతమంది యువతను సమాచార సేకరణ కోసం ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమర్థులైన, సరైన నాయకులు సిద్ధం కావాలని ఆమె ఆకాంక్షించారు.

**ఘన సన్మానం**

సమావేశానికి విచ్చేసిన రాష్ట్ర నాయకురాలు తనూజ రెడ్డిని శంకర్‌పల్లి జనసేన వీరమహిళ గీత శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం సాయికుమార్ గౌడ్ ఆమెకు భగవద్గీత పుస్తకాన్ని, భరతమాత చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు దివాకర్, ఆగేష్, తెలుగు సాయి, విజయ్, శ్రీనివాస్, ప్రవీణ్, మణికంఠ, హృషికేష్ గౌడ్, అర్షిత్, జైపాల్, శ్రీకాంత్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని పరిశీలించిన జెమ్మి దేవేందర్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 11:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి సర్కిల్ 56 సెంట్రల్ పార్క్ ప్రాంతంలో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న స్పెషల్ ఎంటెన్సీ రివిజన్ సర్ కార్యక్రమంలో భాగంగా శనివారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి జెమ్మి దేవేందర్ బూత్ లెవెల్ అధికారులు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఈసందర్భంగా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి జెమ్మి దేవేందర్ మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా, నిష్పాక్షికంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని అధికారులను కోరారు.ప్రజలు బీఎల్‌ఓలు అందజేసే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా పూర్తి చేసి సమర్పించాలని తెలిపారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బిఎల్‌ఓ లు పిఎస్ నెంబర్ 56 నిఖిల్, పిఎస్ నెంబర్ 60 నరేష్, పిఎస్ నెంబర్ 65 శివాజీ, జెమ్మి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మరకత శివాలయంలో నాంపల్లి ట్రిబునల్ కోర్టు జడ్జి లతా బస్వరాజు ప్రత్యేక పూజలు

**శంకర్‌పల్లి వెలుతురు జులై 11:**



మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో వెలసిన 11 వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో శనివారం నాంపల్లి ట్రిబునల్ కోర్టు జడ్జి లతా బసవరాజ్ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ వెయ్యి ఏండ్ల క్రిందటి పురాతనమైన ఆకుపచ్చని శివలింగానికి పూజలు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. మరల సమయం చూసుకొని కుటుంబ సభ్యులతో ఆలయానికి వస్తానని తెలియజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కుమార్ యాదవ్ జడ్జిని స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు పెంటయ్య, భీమిరెడ్డి, అనంతయ్య, అంజయ్య, క్యాషియర్ ప్రశాంత్, దేవేందర్ రెడ్డి, సుధీర్ గౌడ్, జనార్దన్, అర్చకులు సాయిశివ, ఎస్సై దేవేందర్ పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) చెక్కులు అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 11:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.

శనివారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు CMRF మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు.సనది సోనీ కి – రూ . 60,000/–, పెంతోట వెంకటేశ్వర్లు కి – రూ 37,500/–,బొండాడ రాజుకి – రూ60,000/–, మరోజు పద్మ కి – రూ 41,000/– ,జులా స్రవంతి కి – రూ 60,000/–.ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, డీసీసీ ఉపాధ్యక్షులు బుయ్యని శివ కుమార్, డీసీసీ సెక్రటరీ కమిటీ సభ్యులు ఎండి లాయక్, గణేష్, 285 డివిజన్ అధ్యక్షులు గడ్డం స్వాతిక రాజేందర్ రెడ్డి, 277 డివిజన్ అధ్యక్షులు సంజీవ రెడ్డి, 296 డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ, బంగారు మైసమ్మ, గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి జూలై 11:**



శనివారం 132 – జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ, బంగారు మైసమ్మ, గంగమ్మ తల్లి దేవాలయాలలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ , బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిహెచ్. కృష్ణ, ఎం. వీరేష్, ఎం. శంకర్, డి.లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, సీనియర్ నాయకులు కాలే నాగేష్, కుంట సిద్ధిరాములు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, కాలే గణేష్, బాల మల్లేష్, పద్మ, ఇందిరా రెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు ఇఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలి: మంత్రి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 11:**



కార్మికులకు ఇఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ పేర్కొన్నారు. శనివారం.ఐ.డి.ఏ.జీడిమెట్ల,ఫేస్ –5, రోడ్ నెంబర్ –5లో నడిపిస్తున్న సామంతుల ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గత ఆరు సంవత్సరాలుగా పనిచేయుచున్న కార్మికులకు, నెలసరి జీతభత్యాల నుండి ఈఎస్ఐ, పిఎఫ్ డబ్బులు మినహాయిస్తూ ఈఎస్ఐ పిఎఫ్ డబ్బులు కట్టకుండా కాలయాపన చేస్తున్నారు.మాకు న్యాయం చేయించమని రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత కె.యం.

ప్రతాప్ ని కార్మికులు కోరగా, ఆయన వెంటనే స్పందించి తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, ఫ్యాక్టరీస్, శిక్షణ, మైనింగ్, జియాలజీ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామిని కలిసి సామంతుల ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం వారు చేపడుతున్న పిఎఫ్,ఈఎస్ఐ చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కార్మికులకు న్యాయపరంగా రావలసిన పిఎఫ్ డబ్బులను, ఈఎస్ఐ బెనిఫిట్స్ను ఇప్పించమని కోరారు.

ఈసందర్భంగా కార్మిక శాఖ మాత్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందించి, సంబంధించిన అధికారులతో వెంటనే ఫోన్లో మాట్లాడారు, సామంతుల ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పై చట్టపరమైన చర్యలు చేపట్టి, కార్మికులకు న్యాయం చేస్తానన్నారు.

ఈకార్యక్రమంలో సామంతుల ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహాదేవపురం డివిజన్‌లో రూ. 37 లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 11:**

గాజులరామారం సర్కిల్ పరిధిలోని మహాదేవపురం డివిజన్‌లో అంతర్గత రహదారుల అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.37లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాదేవపురం డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించేలా కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుచ్చిరెడ్డి, మహాదేవపురం జనరల్ సెక్రటరీ ప్రసాద్ దుగ్యాల, ఉపాధ్యక్షులు రంగారావు, జగదీశ్వర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు మహేశ్వర్ రెడ్డి, దిలీప్ కుమార్, మల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, యాదగిరిచారి, నవీన్ కుమార్, వెంకట్ రెడ్డి, రాము, అక్షర జ్యోతి మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎన్. పూలమ్మ, పలు కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా అరెస్టులు.. రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ధ్వజం

**శంకర్ పల్లి, వెలుతురు జూలై 11:**





షాబాద్ బాధితుల పరామర్శకు వెళ్తుండగా మధ్యలో అరెస్టులు చేయడం ప్రజా స్వామ్యానికి విరుద్ధమని మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిలు అన్నారు. షాబాద్‌లో జరిగిన ఘోర విషాదంలో ఆరుగురు కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. చేవెళ్ల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని, అనంతరం వారిని శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే అరెస్టులు**

పోలీసుల నిర్బంధంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఒకే కుటుంబంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోతే, ఆ తీవ్ర శోకంలో ఉన్న కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చడానికి వెళ్తుంటే అడ్డుకోవడం అత్యంత దారుణమని ధ్వజమెత్తారు. విపక్ష నాయకులను పరామర్శించకుండా నిరోధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనను గాలికి వదిలేసిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజల ప్రాణాలు, వారి భద్రత పట్ల ప్రస్తుత ప్రభుత్వానికి ఎలాంటి బాధ్యత లేదని, శాంతిభద్రతల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. షాబాద్‌లో జరిగిన ఈ ఘోర విషాద ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తాము వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు.

# ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

- చౌటుప్పల్‌లో అంగరంగ వైభవంగా నిర్వహణ
- అభిమానులు, బీజేపీ నాయకుల సమక్షంలో వేడుకలు
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు
- పలువురు నేతలు, కార్యకర్తల పాల్గొనడం

**చౌటుప్పల్ వెలుతురు జూలై 11:**



చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి బండి సంజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన–ఐలయ్య యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూడల బిక్షం గౌడ్, సీనియర్ నాయకులు రమణ, గోని శంకరయ్య, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఉబ్బు బుచ్చయ్య, గుండెబోయిన వేణు, బూత్ అధ్యక్షుడు ప్రవీణ్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా బండి సంజయ్ ప్రజా సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తూ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా మోత్కుపల్లి నర్సింహులు జన్మదిన వేడుకలు

- అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.10 వేల ఆర్థిక సాయం
- డా "సగరపు ప్రసాద్ చైర్మన్ -సీడ్స్ ఫౌండేషన్

**సూర్యాపేట, వెలుతురు జూలై 11:**





మాజీ మంత్రి, మాదిగ మహాశక్తి వ్యవస్థాపకుడు మోత్కుపల్లి నర్సింహులు జన్మదిన వేడుకలను శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. జన్మదినాన్ని పురస్కరించుకుని మోదీన్‌పురం గ్రామానికి చెందిన, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ ముస్లిం సోదరుడికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని సీడ్స్ ఫౌండేషన్ చైర్మన్ డా.సగరపు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సగరపు ప్రసాద్ మాట్లాడుతూ మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలో కొనసాగుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. ముఖ్యంగా దళితుల హక్కుల కోసం శాసనసభలోనూ, ప్రజా వేదికలపైనా గళమెత్తిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తెలంగాణలో మాదిగ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలనే లక్ష్యంతో 'మాదిగ మహాశక్తి' సంస్థను స్థాపించి సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న మోత్కుపల్లి నర్సింహులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ప్రజాసేవ మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో నేతలు ప్రో "గురునాదం, డా "లింగయ్య, మాదిగ నాయకులు రాములు, శ్రీను, అశోక్ ,మల్లమ్మ, వేణు తదితరులు పాల్గొన్నారు.

# మంద మరయ్య జ్ఞాపకార్థంగా 600వ రోజు నిత్య అన్నదాన కార్యక్రమం

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 11:**



నార్కెట్‌పల్లి వాస్తవ్యులు స్వర్గీయ మంద మరయ్య జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు ప్రేమతో నిర్వహించిన నిత్య అన్నదాన కార్యక్రమం 600వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన భార్య మంద ప్రమీల, కూతుళ్లు–అల్లుళ్లు రాజేశ్వరి–భవాని, మహేశ్వరి–మనోహర్, కుమారుడు–కోడలు మంద గిరి–అక్షయ కలిసి మనం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బిక్షాటన చేసే వారు, నిరుపేదలు, బాటసారులు, నిస్సహాయులు కలిపి 100 మందికి అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా మంద గిరి మాట్లాడుతూ, "మా నాన్న ఆకస్మికంగా మమ్మల్ని విడిచి పెట్టినా, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ చెరిగిపోవు. ఆర్థికంగా పెద్దగా స్తోమత లేకపోయినా ఇతరులకు సహాయం చేయాలనే మంచి మనసు, స్నేహ గుణం మాకు నేర్పించారు. అదే స్ఫూర్తితో ఈ రోజు 100 మంది నిరుపేదల ఆకలి తీర్చడం ఎంతో సంతోషంగా ఉంది. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తాం. ఈ రోజు 100 మంది ఆకలిని తీర్చడం ద్వారా మా నాన్న జ్ఞాపకాన్ని సజీవంగా ఉంచుకున్నాం" అని తెలిపారు.మనం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి దైద నాగరాజు మాట్లాడుతూ, నిత్య అన్నదాన కార్యక్రమం విజయవంతంగా 600 రోజుల మైలురాయిని చేరుకోవడం గర్వకారణమని, ఈ సేవా కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విక్రమాచారి, గుంటూరి ఈశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో తొలి సీఎంపీ ప్యాడ్...

(మొదటి పేజీ తరువాయి)

జపాన్‌కు చెందిన తోహో కోకి సీసాకుషో కంపెనీ లిమిటెడ్ (Toho Koki Seisakusho Co. Ltd.) సహకారంతో టీ-వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... తెలంగాణను దేశంలోనే ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ లక్ష్య సాధనలో తాజాగా ప్రారంభించిన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సెమీకండక్టర్ చిప్‌ల తయారీలో వాఫర్‌ను సమతలంగా మార్చేందుకు ఉపయోగించే ఈ సీఎంపీ ప్యాడ్లను ప్రస్తుతం పూర్తిగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ హబ్ ఏర్పాటుతో ఇప్పటివరకు విదేశాలకే పరిమితమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ తొలిసారిగా దేశంలో హైదరాబాద్ వేదికగా అందుబాటులోకి వచ్చిందన్నారు. విద్యార్థులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు ఈ కేంద్రం ద్వారా శిక్షణతో పాటు పరిశోధనలు చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. ప్రముఖ విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల భాగస్వామ్యంతో వచ్చే 18 నుంచి 24 నెలల్లో సీఎంపీ ప్యాడ్లను దేశంలోనే తయారు చేసేలా సంయుక్త పరిశోధనలు చేపడతామని వివరించారు. సెమీకండక్టర్ రంగంలోని అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు జపాన్ లాంటి దేశాలతో కలిసి ముందుకు సాగుతున్నామన్నారు. పరిశోధన నుంచి చిప్‌ల తయారీ వరకు అవసరమైన సమగ్ర ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తోహో కోకి సీసాకుషో కంపెనీ లిమిటెడ్ ప్రతినిధి టకుయా నిషిమురా, జెట్రో బెంగళూరు డైరెక్టర్ జనరల్ స్వస్తిక్ కులకర్ణి, ఇండోబాక్స్ వ్యవస్థాపకుడు, సీఈవో డైసుకే టాంజి, జపాన్ ఇండియా బిజినెస్ బ్యూరో ఛైర్మన్ షిగెమారో యాసుయి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ-వర్క్స్ సీఈవో జోగిందర్ తనికెళ్ల తదితరులు పాల్గొన్నారు.

# నార్కట్‌పల్లి ప్రజల విజయం – రోడ్డు వెడల్పు పనులకు శ్రీకారం

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 11:**



నార్కట్‌పల్లి పట్టణంలో గత మూడు సంవత్సరాలుగా నిలిచిపోయిన రోడ్డు వెడల్పు పనుల విషయంలో ప్రజల పోరాటం ఫలించింది. ప్రజల ఆందోళనలు, అఖిలపక్షాల ఉద్యమాలకు స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు ఈరోజు టాటా హిటాచి యంత్రాన్ని తీసుకువచ్చి పనులను పరిశీలించి ప్రారంభించారు.గత పది రోజులుగా అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్‌లు, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు తదితర కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపిన బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ(ఎం), సీపీఐ, టీడీపీ, జనసేన, డీఎస్పీ, భీమ్ ఆర్మీ, బీఎస్పీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, యువత, పట్టణ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.మీ అందరి ఐక్యత, అంకితభావం, దీక్ష, నిరంతర పోరాట ఫలితంగానే ఈరోజు రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమవుతున్నాయి.ఇది ఒక్కరి విజయం కాదు... ప్రజల విజయం.ఇది ప్రజాస్వామ్య పోరాట విజయం.ఇది అఖిలపక్షాల ఐక్యత సాధించిన విజయం.ఈ పనులు నాణ్యతతో, వేగంగా పూర్తయ్యే వరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

# కోదాడలో 17 కోట్ల రూపాయల తో నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన...

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ కేంద్రం అధునాతన హంగులతో నూతన ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకొని భూమిపూజ చేసుకున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు.ప్రజా పాలన ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో ముఖ్యమైన ప్రాంతాల్లో ఆర్టీసీ బస్ స్టేషన్ లను నిర్మించడానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నాం.ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడగానే 48 గంటల్లో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం.ఇప్పటివరకు 327 కోట్ల మంది మహిళలు జీరో టికెట్స్ ఉపయోగించుకున్నారు.దాదాపు 11400 కోట్ల పైన ఉచిత ప్రయాణం చేసి డబ్బులు ఆదా చేసుకున్నారు.రాష్ట్రంలో మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తున్నారు.రాష్ట్రంలో 65 లక్షల మంది ఆర్టీసీలో ప్రతిరోజు ప్రయాణం చేస్తుంటే అందులో 35 లక్షల మంది అక్కా చెల్లెల్లు ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తున్నారు.రాఖీ పౌర్ణమి రోజు చరిత్రలో నిలిచిపోయే విధంగా అక్క చెల్లెలు ప్రయాణం చేశారు.ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి ప్రయాణికుల సౌలభ్యం మూడు అంశాలు ప్రాధాన్యత గా నడుస్తుంది.కొత్త నియామకాలు చేపడుతున్నాము కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నాము కారుణ్య నియమాకాలు చేపట్టాం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారు ఆర్టీసీ కి సహకారం అందిస్తున్నారు.తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే నంబర్-1 ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దుతాం.దేశంలోనే ఎక్కడ లేని విధంగా మహిళలు ఉచితంగా ప్రయాణం చేయడమే కాదు మహిళలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేసిన ఘనత ప్రభుత్వంది.

గ్రామ గ్రామాన ఎక్కడ బస్సులు అవసరం ఉంటే అక్కడికి బస్సులు నడుపుతుంది.హైదరాబాద్ నగరంలో 327 కొత్త రూట్ లలో బస్సులు నడుపుతున్నాం.7 లక్షల మంది కి బస్ సౌకర్యం అదనంగా కలిగింది.మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.మహిళల అభివృద్ధిని కొందరు రాజకీయ కారణాలతో అడ్డుకుంటున్నారు.కోదాడ బస్ స్టేషన్ మోడల్ గా నిర్మించడానికి 17 కోట్లు మంజూరు చేశాం.త్వరలోనే బస్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలి.ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు పీసీసీ అధ్యక్షుడు గా ఉన్నప్పుడు నేను వర్కింగ్ ప్రెసిడెంట్ గా పని చేశా..సీనియర్ రాజకీయ నాయకులు నిరంతరం మీకోసం పని చేస్తున్నారు.

# నన్ను తాకితే ఇరాన్ కథ సమాప్తం

- శ్వేతసౌధంలో కూర్చుని ఇరాన్ కుట్రలను ఎండగట్టిన ట్రంప్

**అమెరికా వెలుతురు జూలై 11:**

అంతర్జాతీయ రాజకీయ యవనికపై అమెరికా, ఇరాన్ దేశాల మధ్య దౌత్యపరమైన విభేదాలు ఒక్కసారిగా శృతిమించాయి. తన్ను అత్యంత కిరాతకంగా హత్య చేసేందుకు ఇరాన్ దేశం ఒక రహస్య మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిందన్న అంతర్జాతీయ వార్తలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ఇరాన్ పాలకులకు నరకం చూపిస్తామంటూ మునుపెన్నడూ లేని రీతిలో బహిరంగంగా ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. అగ్రరాజ్య అధినేతను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ సాగిస్తున్న కుట్రల వ్యవహారం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శ్వేతసౌధం సైతం ఈ బెదిరింపులను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.తాను ఇరాన్ పాలకుల వ్యూహాలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్.. ఈ క్రమంలో అమెరికా రక్షణ యంత్రాంగానికి, సైన్యానికి అత్యంత కీలకమైన, కఠినమైన ఆదేశాలు జారీ చేసినట్లు స్వయంగా ప్రకటించారు. ఒకవేళ ఇరాన్ దేశం తనను హతమార్చే కుట్రలో ఏమాత్రం విజయం సాధించినా లేదా తన ప్రాణాలకు ఏదైనా హాని తలపెట్టినా.. అస్సలు ఆలస్యం చేయకుండా ఇరాన్ దేశంపై మానవ చరిత్రలోనే ఇంతవరకు ఎవరూ చూడని రీతిలో అత్యంత భీకరమైన, ఊహించని స్థాయిల్లో బాంబుల వర్షం కురిపించాలని ఆదేశించారు. ఆ దేశాన్ని పూర్తిగా నాశనం చేసి, నామరూపాల్లేకుండా చేయాలని పెంటగాన్ మరియు శ్వేతసౌధానికి స్పష్టమైన రాతపూర్వక ఆదేశాలు ఇచ్చి ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.ఒక ప్రముఖ అంతర్జాతీయ వార్తా పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే, ఇదే సమయంలో ఒక ఆసక్తికరమైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ట్రంప్‌ను అంతమొందించడానికి ఇరాన్ రహస్యంగా కుట్రలు పన్నుతోందంటూ ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ (నిఘా) సంస్థలు తమకు అధికారికంగా ముందస్తు నివేదికలు మరియు హెచ్చరికలు పంపించాయనే వార్తలను ఆయన పూర్తిగా తోసిపుచ్చారు. తన ప్రాణాలకు శత్రువుల నుంచి నిరంతరం ముప్పు పొంచి ఉన్నప్పటికీ.. తాను ఏమాత్రం భయపడటం లేదని, అమెరికా ప్రజల రక్షణే తన మొదటి ప్రాధాన్యతని ఈ సందర్భంగా ట్రంప్ స్పష్టం చేశారు.ఇరాన్ రాజధాని టెహ్రాన్ పాలకులు అధికారికంగా రూపొందించుకున్న 'కిల్ లిస్ట్' (హిట్ లిస్ట్) లో తాను చాలా కాలంగా నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నానని డొనాల్డ్ ట్రంప్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. "నేను ఇరాన్ హిట్ లిస్ట్‌లో ఉండటం అనేది ఈనాటి ముచ్చట కాదు. ఇది చాలా కాలంగా జరుగుతున్నదే. ఇక్కడ నేను ప్రపంచానికి ఒకటే స్పష్టం చేయదలచుకున్నాను. నా ప్రాణాలను తాకాలని చూస్తే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. నా రక్షణ సిబ్బంది మరియు సైన్యం ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నారు" అని ట్రంప్ ధీమా వ్యక్తం చేస్తూ ఇరాన్ కుట్రలను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టారు.ఇరాన్ మాజీ సుప్రీం లీడర్, ఆ దేశ అత్యున్నత ఆధ్యాత్మిక అధినేత అయతోల్లా అలీ ఖమేనీ అధికారిక అంత్యక్రియలు ముగిసిన కొద్ది గంటల వ్యవధిలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ తరహా తీవ్రమైన కామెంట్స్ చేయడం అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పశ్చిమాసియాలో ఇప్పటికే యుద్ధ మేఘాలు కమ్ముకున్న తరుణంలో, అమెరికా అధ్యక్షుడి నోట నుంచి వచ్చిన ఈ హెచ్చరికలు ఇరు దేశాల మధ్య సాయుధ ఘర్షణకు దారితీసేలా ఉన్నాయని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థుల భద్రతకు పెద్దపీట .. ప్రమాదకర విద్యుత్ బుడ్డి తొలగింపు

**మునుగోడు,జూలై 11(వెలుతురు):**

మండల పరిధిలోని రత్తిపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ బుడ్డిని విద్యుత్ శాఖ అధికారులు తొలగించి మరోక చోటికి తరలించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామ సర్పంచ్ జిట్టగోని సైదమ్మ సైదులు మునుగోడు విద్యుత్ ఏఈ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి బుడ్డి షిఫ్టింగ్ కు చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ జిట్టగోని సైదమ్మ సైదులు మాట్లాడుతూ సమస్యను వెంటనే పరిష్కరించి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చిన మునుగోడు ఏఈతో పాటు విద్యుత్ శాఖ సిబ్బందికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇదే తరహా సత్వర స్పందన కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిట్టగోని మల్లేష్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# పలివెల చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా పూల వెంకటేశం

**మునుగోడు,జూలై 11(వెలుతురు):**





పలివెల చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గం శనివారం అధికారికంగా బాధ్యతలు చేపట్టింది. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించిన పాలకవర్గ సభ్యులు ఎన్నికల అధికారి జ్యోతి సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.సంఘ అధ్యక్షుడిగా పూల వెంకటేశం ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఉపాధ్యక్షుడిగా పున్న రాజు,కార్యదర్శిగా చెరుకు నరేష్, కోశాధికారిగా బడుగు గోవర్ధన్ బాధ్యతలు చేపట్టారు.డైరెక్టర్లుగా కొలను రాధిక,చెరుకు జనార్ధన్,కోణం మురళి, మేకల వీరస్వామి, బడుగు హేమలత ఎన్నికయ్యారు.బాధ్యతల స్వీకార కార్యక్రమంలో సంఘ సభ్యులు నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు పూల వెంకటేశం మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకొని సంఘ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పారదర్శకంగా పనిచేస్తామని,తన ఎన్నికకు సహకరించిన ప్రతి సభ్యునికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు

**కేక్ కటింగ్, స్వీట్ల పంపిణీ, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం, సేవా కార్యక్రమాలతో హోరెత్తించిన బిజెపి శ్రేణులు**

**కరీంనగర్ వెలుతురు జూలై 11:**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం రోజున కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ఎంతో ఘనంగా, ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ ప్రాంతాల్లో కేక్ కటింగ్ వేడుకలతో పాటు, అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

**కరీంనగర్ పట్టణం నార్త్ జోన్:**

కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జోన్ అధ్యక్షులు పాదం శివరాజ్ ఆధ్వర్యంలో స్థానికంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో చిగురి రవీంద్ర, కొమ్మెర రవీంద్ర రెడ్డి, పైడి ప్రసాద్, నేదునూరి అనిల్, వినయ్, నిఖిల్, కరుణాకర్, యుగేందర్ రెడ్డి, జితేందర్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

**గన్నేరువరంలో....**

గన్నేరువరం మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఉత్సాహంగా కేక్ కట్ చేసి, అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో ఏలేటి చంద్రారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు మచ్చ బాలరాజు,మండల ప్రధాన కార్యదర్శులు పుల్లెల రాము,బొమ్మాడి సురేందర్ రెడ్డి,మండల ఉపాధ్యక్షులు గాలిపెల్లి శంకర్, కార్యదర్శి చెక్కిళ్ల చంద్రయ్య, గన్నేరువరం 8వ వార్డు సభ్యులు మచ్చ సాయికృష్ణ, మండల కార్యవర్గ సభ్యులు గూడూరి జగన్, మునిగంటి లింగయ్య, జాలి శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ రాజు కుమార్, బూత్ అధ్యక్షులు బోయిని వేణు, హనుమండ్ల రాజిరెడ్డి, రామిడి కృష్ణమూర్తి, దానవేణి ప్రశాంత్,దొగ్గలి జగన్,నాయకులు పుల్లెల జగన్, కొలుపుల వేణు,కుర్ర హరీష్, రంగనవేణి సంతోష్, నల్ల జైపాల్ రెడ్డి, టేకు అనిల్, కూన ప్రశాంత్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్:**

తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నుస్తులాపూర్ లోకేక్ కట్ చేసి స్వీట్లు పంచుతూ సంజయ్ కుమార్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేవైఎం మహాత్మా నగర్ నాయకులు దుర్శటి అజయ్ , ప్రేమ్ చంద్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ మృత్యుంజయ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర్ చారి, ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బీజే వైఎం మండలాధ్యక్షులు గడ్డం అరుణ్, జిల్లా నాయకులు కొయ్యడ శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి,బుర్ర శ్రీనివాస్ గౌడ్, బూట్ల శ్రీనివాస్, జాడి రాజు ,పుట్ట ఓంకార్,బండి స్వామి, దర్శెట్ రమేశ్,గాండ్ల రాము,వేల్పుల ఓదెలు, ధోనపాటి ప్రదీప్ రెడ్డి, కామెర వెంకటేష్, పిస్కా కృష్ణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కొత్తపల్లి రూరల్:

కొత్తపల్లి రూరల్ అధ్యక్షులు కుంట తిరుపతి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ జన్మదినోత్సవ వేడుకలు విశేషంగా జరిగాయి. కేక్ కటింగ్, స్వీట్ల పంపిణీతో పాటు, రక్తదాన శిబిరాన్ని నిర్వహించి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు కడార్ల రతన్ , మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కరీంనగర్ నగరం (7వ డివిజన్):

కరీంనగర్ నగరపాలక సంస్థ ఏడో డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా



నిరుపేదలకు అన్నదానం చేసి సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ వేడుకల్లో బిజెపి నాయకులు తోట సతీష్ , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# SIR ఫారాలు వెంటనే నింపి సమర్పించాలి

- **మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్..**

**జహీరాబాద్ వెలుతురు జూలై 11:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియపై మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎండీ ఘౌస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కండెం నర్సింలు, మున్సిపల్ కౌన్సిలర్లు ఎండీ జహంగీర్, వకీల్ చౌహాన్, ఎండీ నిజామొద్దీన్, కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, ఎండీ అక్రం తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా



మీడియాతో మాట్లాడిన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్... జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 37 వార్డుల ప్రజలు ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ప్రతి ఓటరు తమ SIR ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బూత్ లెవల్ అధికారి (BLO)కి నిర్ణీత గడువులోగా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. యువత కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజలకు సహకరించాలని పిలుపునిచ్చారు.జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 79,742 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటికే 77,951 SIR ఫారాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో 1,791 ఫారాలు పంపిణీ చేయాల్సి ఉందని, వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. నిర్ణీత గడువులోగా వివరాలు నమోదు చేస్తే సాంకేతిక, పరిపాలనా ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో దేవూజా

**జహీరాబాద్ వెలుతురు జూలై 11:**

జహీరాబాద్ పట్టణంలోని 27వ వార్డులో గల 174వ పోలింగ్ స్టేషన్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను జహీరాబాద్ ఆర్డీవో దేవూజా శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో చేపడుతున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులు, సిబ్బంది నుంచి ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల నుంచి



అందుతున్న దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు స్వీకరించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిష్పాక్షికంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్, బీఎల్‌వో వసియా ప్రవీణ్, ఆర్పీ లక్ష్మి , బీఎల్ఏలు నరేష్‌రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# నిర్దిష్ట గడువులోగా SIR ఫారాలు సమర్పించాలి

- **ఎన్యూమరేషన్ కోసం బీఎల్‌వోలను సంప్రదించాలి....**
- **పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి**

**జహీరాబాద్ వెలుతురు జూలై 11:**

ప్రభుత్వం నిర్ణయించిన గడువు వరకు వేచి చూడకుండా గ్రామ ప్రజలు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ఫారాలను ముందుగానే సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వో) సమర్పించాలని శేఖపూర్ పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి సూచించారు.శనివారం శేఖపూర్ గ్రామంలో కొనసాగుతున్న SIR ప్రక్రియను గ్రామ సర్పంచ్ మొహమ్మద్ చేష్మొద్దీన్, గ్రామ కాంగ్రెస్ పార్టీ తరఫున నియమితులైన బీఎల్ఏ మొహమ్మద్ ఖుర్షిద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు SIR ఫారాలు నింపడంలో అవసరమైన సహాయం అందిస్తూ ప్రక్రియను వేగవంతం చేశారు.ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన గడువు కోసం ఎదురు చూడకుండా గ్రామ ప్రజలు తమ SIR ఫారాలను పూర్తిగా నింపి, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా సంబంధిత బీఎల్‌వోలు హాజీరా బేగం, ఎం.



లలిత, పుణ్యమ్మలకు వెంటనే అందజేయాలని కోరారు. దీంతో ఓటరు వివరాల నమోదు సులభంగా పూర్తవుతుందని తెలిపారు.కార్యక్రమంలో బీఎల్‌వోలు లలిత, హాజీరా బేగం, పుణ్యమ్మ, గ్రామ కాంగ్రెస్ బీఎల్ఏ మొహమ్మద్ ఖుర్షిద్, మొహమ్మద్ అబ్దుల్ రావుఫ్, వార్డు సభ్యులు జాహెద్ అలీ, మరియం సైఫ్, కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ ఆరిఫ్ అలీ, షైక్ అలీ, సీఏ అబ్దుల్ మజీద్, షకీర్ ఒస్తాద్, అసద్ బిన్ సయిద్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోనే టాప్.. రాగంపేట బిఎల్ఓలను అభినందించిన సింగిరెడ్డి కృష్ణారెడ్డి





**చొప్పదండి, వెలుతురు జూలై 11:**

మండలంలోని రాగంపేట గ్రామంలో ఓటర్ల నమోదు ప్రక్రియలో ముందంజలో ఉన్న బూత్ లెవల్ అధికారులను (బిఎల్ఓ) బిజెపి నాయకులు ఘనంగా సన్మానించారు. గ్రామంలోని మూడు పోలింగ్ బూత్‌లలో మ్యాపింగ్ అయిన ఓట్లలో దాదాపు 70 శాతం నమోదును పూర్తి చేసి, నియోజకవర్గంలోనే మొదటి ఐదు స్థానాల్లో నిలిచినందుకు గాను బిఎల్ఓలు కుక్కల లక్ష్మణ్, మామిడి పోచయ్య, బొల్లం సరోజనలను బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ సవరణ పత్రాల నమోదులో రాగంపేట గ్రామం నియోజకవర్గంలోనే అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. ఇందుకు కృషి చేసిన బిఎల్ఓలు, ఎన్నికల అధికారులతో పాటు సహకరించిన గ్రామస్థులకు ఆయన అభినందనలు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా బూత్ లెవల్ అధికారులతో పాటు పౌర సమాజం కూడా బాధ్యతగా శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఇంకా ఓటు హక్కు నమోదు చేసుకోని వారు ఉంటే, వెంటనే సంబంధిత బిఎల్ఓలను సంప్రదించి ఫారాలను అందజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, సింగసాని కనకయ్య, నరేష్, సిరవేణి మల్లేశం, మొండయ్య, గొల్లపల్లి మునీందర్, ముంజాల అశోక్, గుండె వెంకటేష్, గసిగంటి రవి, మ్యాక లరాములు , బసరవేణి స్వామి, తిరుపతి, రాచకొండ ఉమేష్, దుర్మట్ల గంగరాజు, భూతగడ్డల కనకయ్య, ఎల్లాల చుక్క రెడ్డి, బోనగిరి శ్రీనివాస్, గడ్డం రాజు, ఆవుల భీమయ్య, లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసు కక్ష.. ఆరుగురి ప్రాణాలు బలి

- **షాబాద్‌లో ఒకే రాత్రి ఆరుగురిని పొట్టనపెట్టుకున్న నిందితుడు**
- **పరారీలో కొనసాగుతున్న రాజ్‌కుమార్**
- **పోక్సో కేసు నమోదు చేయించారనే కక్షతో దారుణ హత్యాకాండ**
- **మైనర్ బాలిక, ఆమె తల్లి, నాయనమ్మను కత్తితో హత్య చేసిన నిందితుడు**
- **అనంతరం ఇంటికెళ్లి భార్య, ఇద్దరు చిన్నారుల గొంతులు కోసి హతమార్చిన రాజ్‌కుమార్**
- **తండ్రికి ఫోన్ చేసి "ఆరుగురిని చంపాను.. నేనూ చనిపోతున్నా" అంటూ చెప్పిన నిందితుడు**
- **బెయిల్‌పై బయటకు వచ్చిన కొద్ది రోజులకే దారుణానికి పాల్పడిన నిందితుడు**
- **వరుసగా రెండు చోట్ల జరిగిన హత్యలతో ఉలిక్కిపడ్డ షాబాద్ ప్రజలు**
- **ఘటనాస్థలాలను పరిశీలించిన ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి**
- **నిందితుడి కోసం ఏడు ప్రత్యేక పోలీసు బృందాల గాలింపు**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 11:**

రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఆరుగురి హత్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. ఒకే రాత్రిలో ఇద్దరు చిన్నారులు, తన భార్య, పోక్సో కేసు నమోదు చేయించిన మైనర్ బాలిక, ఆమె తల్లి, నాయనమ్మలను అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో ఈ ఘాతుకానికి పాల్పడిన రాజ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉండగా, అతడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడకు చెందిన రాజ్‌కుమార్ (28)పై మైనర్ బాలికను వేధించాడనే ఆరోపణలతో ఈ ఏడాది మే 16న పోక్సో కేసు నమోదైంది. ఆ కేసులో అరెస్టయిన అతడు అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాడు. అయితే తనపై కేసు నమోదు చేయించిన కుటుంబంపై తీవ్ర కక్ష పెంచుకున్న రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి అమానుష హత్యాకాండకు తెరలేపాడు.మొదట షాబాద్‌లోని పీఆర్ఆర్ స్టేడియం సమీపంలో నివసిస్తున్న 17 ఏళ్ల మైనర్ బాలిక ఇంటికి వెళ్లిన నిందితుడు ఆమెను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో బాలిక తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మ అడ్డుకోవడంతో వారిద్దరిపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలతో వారు అక్కడికక్కడే మృతి చెందారు.అనంతరం మైనర్ బాలికను బలవంతంగా అక్కడి నుంచి తీసుకెళ్లిన రాజ్‌కుమార్, దైవాలగూడ సమీపంలోని అఖిల్‌సాగర్ చెరువు వద్దకు తీసుకెళ్లి ఆమెను కూడా అత్యంత దారుణంగా హత్య చేశాడు. గొంతు కోసి హతమార్చిన అనంతరం అక్కడి నుంచి తన ఇంటికి వెళ్లాడు.అక్కడ కూడా అతడి క్రూరత్వం ఆగలేదు. తన భార్య సరిత (33), నాలుగేళ్ల కుమారుడు పరీక్షిత్, రెండేళ్ల కుమారుడు దైవీక్షిత్‌లపై కత్తితో దాడి చేసి ముగ్గురినీ హత్య చేశాడు. భార్యతో పాటు కన్నబిడ్డలను కూడా అత్యంత దారుణంగా చంపడం పోలీసులను సైతం విస్మయానికి గురిచేసింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, మరో కుటుంబానికి



చెందిన ముగ్గురిని వరుసగా హత్య చేయడంతో ప్రాంతమంతా భయానక వాతావరణం నెలకొంది.ఈ ఘాతుకం అనంతరం రాజ్‌కుమార్ తన తండ్రి అరుణ్‌కుమార్‌కు ఫోన్ చేసి "నేనే ఆరుగురిని చంపాను... నేను కూడా చనిపోతున్నా" అని చెప్పినట్లు సమాచారం. దీంతో ఆందోళన చెందిన తండ్రి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న షాబాద్ పోలీసులు రెండు ప్రాంతాలకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.ఈ ఘటన సమాచారం అందుకున్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి సంఘటన స్థలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఘటనకు సంబంధించిన ప్రతి కోణాన్ని పరిశీలించాలని, నిందితుడిని వీలైనంత త్వరగా అరెస్టు చేయాలని దర్యాప్తు బృందాలను ఆదేశించారు. నిందితుడి కోసం ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అతడు రాష్ట్ర సరిహద్దులు దాటకుండా అన్ని జిల్లాలకు అప్రమత్తత సూచనలు జారీ చేసినట్లు సమాచారం.ఇదిలా ఉండగా, ఈ దారుణ ఘటనతో మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ షాబాద్–కంది ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. నిందితుడిని ఆలస్యం చేయకుండా పట్టుకోకపోతే మరిన్ని ప్రాణాలు తీసే ప్రమాదం ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.రాజ్‌కుమార్ ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి వివాహం చేసుకున్నట్లు సమాచారం. అయితే పోక్సో కేసు నమోదైన తర్వాత అతడి ప్రవర్తనలో తీవ్ర మార్పు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. కేసు నుంచి బయటపడలేనన్న భావనతో పాటు తనపై ఫిర్యాదు చేసిన కుటుంబంపై పెంచుకున్న కక్ష చివరకు ఈ ఘోర హత్యలకు దారితీసినట్లు ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే హత్యలకు దారితీసిన పూర్తి కారణాలు, ముందస్తు ప్రణాళిక, నిందితుడి కదలికలపై పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు.ఒకే రాత్రిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం, అందులో ఇద్దరు చిన్నారులు ఉండడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. నిందితుడి కోసం పోలీసుల ముమ్మర గాలింపు కొనసాగుతుండగా, ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. షాబాద్‌లో చోటుచేసుకున్న ఈ సామూహిక హత్యల ఘటన రాష్ట్రంలో ఇటీవల కాలంలో జరిగిన అత్యంత దారుణ నేరాల్లో ఒకటిగా నిలిచింది.

# తలసేమియా చిన్నారుల కోసం అగ్రికల్చర్ కాలనీలో రక్తదాన శిబిరం




**ఎల్‌బీనగర్ వెలుతురు జూలై 11:**

అగ్రికల్చర్ కాలనీలోని గణేష్ మండపంలో తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కామినేని హాస్పిటల్స్, ఎల్‌బీనగర్ వారి సహకారంతో నిర్వహించిన ఈ మెగా హెల్త్ క్యాంప్‌ను సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని అగ్రికల్చర్ కాలనీ ప్రెసిడెంట్ టి. బుచ్చిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ సెక్రటరీ వెంకట్రాం రెడ్డి, ట్రెజరర్ చిన్నా రెడ్డి, కామినేని హాస్పిటల్స్ అడ్మినిస్ట్రేటర్ గోకుల్ రఘురాం, మార్కెటింగ్ గ్రూప్ హెడ్ కొడతాల సత్యనారాయణ, తలసేమియా కోఆర్డినేటర్ సురేందర్ పాల్గొన్నారు.అలాగే కామినేని బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి. మాధురి, డాక్టర్లు ఎస్. కృష్ణ, జస్వంత్ రెడ్డి (జనరల్ మెడిసిన్), సాయి స్వప్నిక (గైనకాలజిస్ట్), యశ్వంత్ (ఆర్థోపెడిక్), దీపిక (గైనకాలజిస్ట్), అఖిల మోహన్ (జనరల్ మెడిసిన్), సుహాసిని (జనరల్ మెడిసిన్), ప్రేరణతో పాటు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ బాలకృష్ణ, పవన్, అంజి, రంజిత్ రెడ్డి, మహేష్, లత తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తలసేమియా చిన్నారులకు అండగా నిలిచారు. తలసేమియా బాధితులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని, ఆరోగ్యవంతులు తరచూ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# రవీంద్రభారతిలో రాజీవ లక్ష్మీ వాసన్ నవలల ఆవిష్కరణ: రచయిత్రికి "మహిళా సేవా రత్న" పురస్కారం




**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**

రవీంద్రభారతి వేదికగా శనివారం ప్రముఖ రచయిత్రి రాజీవ లక్ష్మీ వాసన్ రచించిన "నడుస్తున్న కథ", "రాబోవు తరం స్త్రీ" నవలల ద్వితీయ ముద్రణ ఆవిష్కరణ సభ అత్యంత వైభవంగా జరిగింది. మహిళా భారతి (సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు సాహిత్య రంగ ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా సామాజిక, సాహిత్య రంగాల్లో లక్ష్మీ వాసన్ గారు అందించిన విశేష సేవలను గుర్తిస్తూ మహిళా భారతి సంస్థ తరపున ఆమెకు ప్రతిష్టాత్మక "మహిళా సేవా రత్న" (జీవన సాఫల్య పురస్కారం) అందజేసి, ఘనంగా సత్కరించారు.

**ముఖ్య అతిథుల ప్రసంగాలు - నవలల ఆవిష్కరణ**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ మణికొండ వేద కుమార్ గారు పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక గ్రంథ రచయిత శ్రీ వై.సి. రావు గారు సాహిత్య ప్రాధాన్యతను వివరించారు.1980, 1982 ప్రాంతంలోనే స్త్రీ ప్రధాన ఇతివృత్తాలుగా, మహిళల సమస్యలు, వారి ఆత్మగౌరవ సంరక్షణే ధ్యేయంగా ఈ నవలలు రాయడం విశేషమని వక్తలు కొనియాడారు.

సభలో "నడుస్తున్న కథ"

నవలను శ్రీమతి సుజాత ప్రసాద్ గారు సమీక్షించగా,"రాబోవుతరం స్త్రీ" నవలను ప్రముఖ రచయిత్రి షేక్ సలీమా గారు సభకు పరిచయం చేశారు.

ఘనంగా సభా నిర్వహణ

మహిళా భారతి అధ్యక్షురాలు డాక్టర్ దాసోజు పద్మావతి గారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సంస్థ సభ్యులు జయశ్రీ విశ్వేక, శ్రీ మేక రవీంద్ర గారు, శ్రీమతి సంధ్య సూతవే గారు పాల్గొని ప్రసంగించారు.కార్యక్రమం ప్రారంభంలో శ్రీ రాజీవ వాసన్ గారు వేదికపైకి అతిథులను ఆహ్వానించగా, శ్రీమతి పైడిమర్రి గిరిజ గారు సభను సమర్థవంతంగా నిర్వహించారు. ముగింపులో అరుణ పరంధాములు వందన సమర్పణ చేశారు.ఈ సందర్భంగా రచయిత్రి లక్ష్మీ వాసన్ గారు సభకు విచ్చేసిన అతిథులను, పుస్తక సంపాదకులను, సాంకేతిక సిబ్బందిని ప్రత్యేకంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ పుస్తకావిష్కరణ సభ ఆద్యంతం సాహిత్య పరిమళాల మధ్య విజయవంతంగా సాగింది.

# మియాపూర్ ఫ్లైఓవర్, మైహోమ్ మంగళ RUB పనులను పరిశీలించిన సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ సన్‌ప్రీత్ సింగ్




**సైబరాబాద్ వెలుతురు జూలై 11:**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కొనసాగుతున్న మియాపూర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు, మైహోమ్ మంగళ రైల్వే అండర్ బ్రిడ్జ్ (RUB) పనులను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, వాటి కారణంగా ట్రాఫిక్‌పై పడుతున్న ప్రభావాన్ని సమీక్షించి, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం NH-65లో మియాపూర్ నుంచి అల్విన్ వరకు సర్వీస్ రోడ్ అభివృద్ధి కోసం ప్రతిపాదించిన ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికను పరిశీలించారు. డైవర్షన్ అమలు సమయంలో వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ట్రాఫిక్‌ను సురక్షితంగా, అంతరాయం లేకుండా మళ్లించేందుకు అవసరమైన ప్రాంతాల్లో బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే డైవర్షన్ అమలుకు ముందు ట్రయల్ రన్ నిర్వహించి, లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు.నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ప్రజలకు ఇబ్బందులు తగ్గేలా ట్రాఫిక్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ పోలీసులు, నిర్మాణ సంస్థలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.ఈ పరిశీలనలో డీసీపీ ట్రాఫిక్-II శేషాద్రిని రెడ్డి, డీసీపీ ట్రాఫిక్-I ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్-II టి. హనుమత్ రావు, ఏసీపీ మియాపూర్ ట్రాఫిక్ ఆది మూర్తి, మాధాపూర్ ట్రాఫిక్ విభాగానికి చెందిన అధికారులు, గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, అలాగే CMC విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (EE) అధికారులు పాల్గొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి విగ్రహప్రతిష్ట మహత్వంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



ఆరుట్ల గ్రామంలో అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పంబాల బుగ్గరా ములు నివాసానికి వెళ్లి పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



ఆరుట్ల గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి వికలాంగుడు మద్దెల బాలరాజుగౌడ్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం లో పాల్గొని ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

- **నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల సందర్శన**
- **దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది**
- **అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం**
- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**మంచాల వెలుతురు జులై 11:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రం గారెడ్డి పర్యటించి గ్రామంలో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్య క్రమం సందర్భంగా అయ్యప్ప స్వాముల ఆహ్వానం మేరకు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కుఅయ్య ప్పస్వాములు ఘనస్వాగతం పలికారు అయ్యప్పస్వామి విగ్రహప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆ హ్వానం మేరకు విగ్రహప్రతిష్ట మహోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారిని ఆలయ ట్రస్టు చైర్మన్ మారగోని మాసయ్యగౌడ్ విఆర్ వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ గురుస్వామి కావలి శ్రీనివాస్ ముదిరాజ్ అయ్యప్పస్వాములు కలిసి ఎమ్మెల్యేగారిని శాలువతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని డబ్బు లు అయినా మంజూరు చేయడానికి సిద్ధంగాఉంది అని అన్నారు రాబోయే రోజుల్లో ఆరుట్ల గ్రామాన్ని ఒక ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తాను అనిఅన్నారు అనంతరం ఇందిరమ్మ కమిటీ స భ్యుల ఆధ్వర్యంలో ఆరుట్ల గ్రామంలో వికలాంగుడు మద్దెల బాలరాజు గౌడ్ ఇందిరమ్మ ఇల్లును సందర్శించిన ఎమ్మెల్యేమల్ రంగారెడ్డి బాలరాజుగౌడ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి కుటుంబ స మస్యలు తెలుసుకున్నాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వికలాంగులకు ముందు ప్రాధాన్యత ఇస్తుంది అని అన్నారు గ్రామంలో అర్హులైన వారందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చే యిస్తాం ఎవ్వరు ఆందోళన చెందవద్దు అనిఅన్నారుఇప్పటివరకు పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లను త్వరలో ప్రారంభోత్సవం చేస్తాం అనిఅన్నారు అనంతరం అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకుడు పంబల బు గ్గరాములు నివాసానికి వెళ్లి పరామర్శించి బుగ్గరాములు ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు ఈకార్యక్రమంలో ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉ పసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మంచా ల సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి మాజీ జెడ్పిటిసి భూపతిగల్లా మహిపాల్ కాంగ్రె స్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రెడ్డి జిల్లాఅధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వింజమూరి ప్రేమకర్ రెడ్డి సహకార సంఘం డైరెక్టర్లు జె నిగే వెంకటేష్ యాదవ్ వేణుగోపాలరావు వింజమూరి రాంరెడ్డి కొత్తకురమ మంగమ్మశివకుమార్ చీమల జంగయ్యయాదవ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నరసింహగౌడ్ బుట్టి కృష్ణ ముది రాజ్ మారలక్ష్మణ్ కంబాలపల్లి బుగ్గరాములు కోరే బాబు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూ కం బాలరాజ్ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రా వుల భాష గుడ్డి మల్ల చంద్రయ్య ముదిరాజ్ చిందం ఐలయ్య ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరె సికిందర్ రెడ్డి మంచాల మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల రాఘవ వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు అయ్యప్ప స్వాము లు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

- **నగర వ్యాప్తంగా విస్తృతంగా జరిగిన బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకల్లో సేవా, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న మేయర్ కోలగాని శ్రీనివాస్**
- **క్షేత్రస్థాయిలో దిగ్విజయనేత బండి సంజయ్...**
- **మేయర్ కోలగాని శ్రీనివాస్...**

**కరీంనగర్ వెలుతురు జూలై 11:**




కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ గారి జన్మదిన వేడుకలు శనివారం కరీంనగర్ నగరంలో అత్యంత వైభవంగా, ఘనంగా జరిగాయి. నగర పాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ గారి సారథ్యంలో జరిగిన ఈ వేడుకలు నగరవ్యాప్తంగా పండుగ వాతావరణాన్ని తలపించాయి.నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలతో బండి సంజయ్ కుమార్ గారి పుట్టినరోజు వేడుకలు ప్రత్యేకంగా కనిపించాయి. మేయర్ కొలగాని శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో నగరం నలుమూలలా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ గారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు తీగలగుట్టపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుండి జన్మదినోత్సవ వేడుకలను ప్రారంభించి, నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన పుట్టినరోజు వేడుకల కు, ప్రోగ్రామ్ లకు హాజరయ్యారు. తీగల గుట్టపల్లి లోని శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, బండి సంజయ్ కుమార్ గారు ఆయురారోగ్యాలతో, ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని భగవంతుడిని మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు ప్రార్థించారు. అనంతరం తెలంగాణ చౌక్‌లో బిజెపి జిల్లా జిల్లా శాఖ, నగరపాలక సంస్థ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన 54 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలతో కలిసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కరీంనగర్ బస్టాండ్ ఎదురుగా మేయర్ గారి ఆధ్వర్యంలో చేపట్టిన అన్న దాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాద వితరణ చేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు దుప్పట్ల పంపిణీ చేశారు. పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో, బిజెపి మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో నాకా చౌరస్తాలో చేపట్టిన రక్తదాన శిబిరంలో పాల్గొని, రక్తదాతలను ఉత్సాహపరిచారు. 35వ డివిజన్ లో మొక్కలు నాటారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని మేయర్ కోలగాని శ్రీనివాస్ గారు ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరంలో ఈసీజీ, 2డి ఈకో , బిపి, షుగర్ , ఇతర ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మంచిర్యాల చౌరస్తాలోని వికలాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. బిజెపి కార్పొరేటర్ ఏపీపీ చంద్ర (టింకు) ఆధ్వర్యంలో ప్రభుత్వ సివిల్ హాస్పిటల్ లో ఏర్పాటుచేసిన అల్పాహార పంపిణీ కార్యక్రమంలోమేయర్ కొలగాని శ్రీనివాస్ గారు పాల్గొని అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగామేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ప్రజా నేత బండి సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా నగరవ్యాప్తంగా చేపట్టిన అనేక సేవా కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. ముఖ్యంగా కార్పొరేటర్ నుండి కేంద్ర మంత్రి స్థాయి వరకు ఎదిగిన బండి సంజయ్ గారు , క్షేత్రస్థాయిలో దిగ్విజయనేత అని కొనియాడారు. "దేశ ప్రగతి కోసం, కరీంనగర్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న బండి సంజయ్ కుమార్ గారు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బండి సంజయ్ గారి బాటలోనే నడుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తామంతా నిరంతరం కృషి చేస్తాం" అని కొలగాని శ్రీనివాస్ గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి గారు, డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు గారు, బిజెపి కార్పొరేటర్లు కోఆప్షన్ మెంబర్లు ప్రజాప్రతినిధులు నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఐదవ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 26 లో జరిగిన గోల్డ్ మెడల్ సాధించిన అబిడ్స్ పోలీసులు

**బషీర్ బాగ్ వెలుతురు 11 జులై:**



తెలంగాణ 5వ పోలీస్ గేమ్స్ & స్పోర్ట్స్ మీట్ 2026 లో రాణించిన అబిడ్ రోడ్ పోలీస్ సిబ్బంది,ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ఇటీవల ముగిసిన "5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ & స్పోర్ట్స్ మీట్ 2026" లో ఖైరతాబాద్ జోన్ పరిధిలోని అబిడ్స్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ సిబ్బంది అద్భుతమైన క్రీడా నైపుణ్యం, క్రమశిక్షణ మరియు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి అగ్రస్థానాలను కైవసం చేసుకున్నారు.హైదరాబాద్ సిటీ పోలీస్ తరపున ఎంతో గర్వంగా ప్రాతినిధ్యం వహించిన అంకితభావం కలిగిన ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు అత్యంత పోటీతత్వంతో కూడిన ఈవెంట్లలో పలు పతకాలను సాధించారు.బి. మహేష్ యాదవ్ (PC 5025): హెవీ వెయిట్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ రెండు బంగారు పతకాలను సాధించారు. ఆయన కుస్తీ (ఫ్రీస్టైల్ - 100 కేజీలు) విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, ఆ తర్వాత జూడో (100 కేజీలు) విభాగంలోనూ అద్భుత ప్రదర్శనతో మరోసారి ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు.టి. రాఘవేంద్ర (PC 9950): ఫెన్సింగ్ ఈపి (Fencing Epee) ఈవెంట్‌లో అసాధారణమైన నైపుణ్యం, చురుకుదనం మరియు వ్యూహాత్మక ఖచ్చితత్వాన్ని ప్రదర్శించి కాంస్య పతకాన్ని (3వ స్థానం) సాధించారు.ఖైరతాబాద్ జోన్ మరియు అబిడ్స్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఉన్నతాధికారులు పీ.సీ. బి. మహేష్ యాదవ్, పీ.సీ. టి. రాఘవేంద్రల యొక్క ఆదర్శప్రాయమైన అంకితభావాన్ని అభినందిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వీరి విజయాలు స్థానిక పోలీసు రంగానికి ఎనలేని కీర్తిని తీసుకురావడమే కాకుండా, మొత్తం శాఖకే స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని, శారీరక దృఢత్వం మరియు క్రీడల పట్ల చూపే అంకితభావం ప్రజాసేవతో సమానంగా సాగుతుందని వారు పేర్కొన్నారు. తమ కఠినమైన రోజువారీ పోలీసు విధులను నిర్వహిస్తూనే, మరోవైపు తీవ్రమైన క్రీడా శిక్షణను సమతుల్యం చేసుకుంటూ, తెలంగాణ పోలీస్ శాఖలో ప్రతిభకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన విజేతలను అధికారులు స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.పరశురామ్ (SHO),అబిడ్స్ పోలీస్ స్టేషన్, ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ సిబ్బంది వారిని అభినందించారు.

# నౌకాదళ అమ్ములపొదిలో మరో అస్త్రం

- ఐఎన్ఎస్ 'మహేంద్రగిరి' యుద్ధనౌక ప్రారంభం
- భవిష్యత్తు యుద్ధ వ్యూహాలపై రాజ్‌నాథ్ సింగ్ కీలక ప్రకటన
- విశాఖ వేదికగా ఐఎన్ఎస్ మహేంద్రగిరి జలప్రవేశం
- తూర్పు నావికాదళంలో సరికొత్త శకం ప్రారంభించిన మంత్రి
- భవిష్యత్తులో మారనున్న యుద్ధాల స్వభావం
- డ్రోన్లు, సైబర్ దాడుల ముప్పుపై అప్రమత్తంగా ఉన్నాం
- రాడార్లకు చిక్కని పర్వత సమాన శక్తి
- బ్రహ్మోస్ క్షిపణులు, రాకెట్ లాంచర్లతో మహేంద్రగిరి విధ్వంసం
- ఏఐ, న్యూ టెక్నాలజీతో ఆధునిక పోరాట సామర్థ్యం
- సాగర తీర రక్షణలో అగ్రగామిగా విశాఖపట్నం
- ఉదయగిరి, నీలగిరి, తారాగిరి శ్రేణిలో మరో మైలురాయి

**ఢిల్లీ వెలుతురు జూలై 11:**

భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నౌకాదళ అమ్ములపొదిలో మరో శక్తివంతమైన అస్త్రం చేరింది. విశాఖపట్నంలోని తూర్పు నావికాదళ (ఈస్టర్న్ నావల్ కమాండ్) వేదికగా అత్యాధునిక యుద్ధనౌక ఐఎన్ఎస్ 'మహేంద్రగిరి' కమిషనింగ్ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై, యుద్ధనౌకను అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పూర్తి స్వదేశీ నైపుణ్యంతో, భారతీయ ఇంజనీర్ల ప్రతిభతో రూపుదిద్దుకున్న మహేంద్రగిరి.. ఇకపై సముద్ర జలాల్లో భారత సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు సిద్ధమైందని ఆయన ప్రకటించారు. భారీ నౌకానిర్మాణ ప్రాజెక్టులు దేశంలో శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయని చెప్పడానికి ఈ నౌకే నిదర్శనమన్నారు.యుద్ధనౌక ప్రారంభోత్సవం అనంతరం రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో అంతర్జాతీయంగా యుద్ధాల స్వభావం, వ్యూహాలు పూర్తిగా మారిపోతున్నాయని హెచ్చరించారు. సాంప్రదాయ యుద్ధాల కంటే భవిష్యత్తులో డ్రోన్లు, సైబర్ దాడుల రూపంలోనే దేశాలకు పెద్ద ఎత్తున సవాళ్లు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. మారుతున్న ఇటువంటి వ్యూహాత్మక పరిస్థితులను, ముప్పులను దృష్టిలో ఉంచుకుని భారత రక్షణ వ్యవస్థలు నిరంతరం అప్రమత్తంగా ఉన్నాయని స్పష్టం చేశారు. సాంకేతికంగా భారతదేశాన్ని ఇంకా బలంగా మార్చేందుకు, ఆధునిక సవాళ్లను తిప్పికొట్టేందుకు రక్షణ శాఖలో సరికొత్త నూతన ఆవిష్కరణలకు పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.ఐఎన్ఎస్ మహేంద్రగిరి యుద్ధనౌక ప్రత్యేకతలను రక్షణమంత్రి ఈ సందర్భంగా వివరించారు. శత్రువుల రాడార్లకు కంటికి చిక్కకుండా కడలి గర్భంలో అత్యంత వేగంగా దూసుకుపోవడం దీని ప్రధాన ప్రత్యేకత అని చెప్పారు. పురాణాలలో పరశురాముడు తపస్సు చేసిన పవిత్రమైన మహేంద్రగిరి పర్వతం పేరును దీనికి పెట్టామని, ఆ పర్వతానికి ఉన్నంత అచంచలమైన శక్తి ఈ నౌకకు ఉందని కొనియాడారు. ఈ అత్యాధునిక యుద్ధనౌకలో శత్రువుల గుండెల్లో వణుకు పుట్టించే అత్యంత ప్రమాదకరమైన 'బ్రహ్మోస్' సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులను (మిస్సైల్స్) అమర్చినట్లు తెలిపారు. దీనితో పాటు శత్రువుల దాడులను తిప్పికొట్టేలా అత్యాధునిక రాకెట్ లాంచర్ సిస్టమ్‌ను కూడా ఈ నౌకపై ఏర్పాటు చేశామన్నారు.భారత నావికాదళం ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , న్యూ టెక్నాలజీ, అడ్వాన్స్డ్ షిప్ డిజైన్లను పెద్ద ఎత్తున సొంతం చేసుకుంటోందని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. సరికొత్త డ్రోన్ టెక్నాలజీ, పూర్తి నిఘా (ఫుల్ సర్వేలెన్స్) సామర్థ్యంతో కూడిన ఆధునిక యుద్ధశక్తితో భారత్ ముందడుగు వేస్తోందన్నారు. అయితే, ఈ



సరికొత్త రక్షణ పరిజ్ఞానం కేవలం యుద్ధాల కోసం మాత్రమే కాదని, అవసరమైన వేళల్లో పొరుగు దేశాలకు మానవతా సహకారంగా కూడా నిలుస్తుందని స్పష్టం చేశారు. "యుద్ధం అనేది ఎప్పటికీ మా నినాదం కాదు.. శాంతి, సర్వ ప్రపంచ శాంతే భారతదేశం యొక్క అసలైన నినాదం" అని ఆయన ఉద్ఘాటించారు. గతంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' యుద్ధం కోసం చేసింది కాదని, మన దేశ స్థిరత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో శత్రువులకు చూపించడానికేనని గుర్తుచేశారు.సముద్ర వాణిజ్యం, రక్షణ రంగాల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 'మారిటైమ్ విజన్ 2030' అనే పటిష్టమైన లక్ష్యంతో పనిచేస్తోందని కేంద్ర రక్షణమంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా 'మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్' ను కూడా సిద్ధం చేసినట్లు ప్రకటించారు. భారతదేశాన్ని గ్లోబల్ షిప్ బిల్డింగ్ హబ్‌గా మార్చే క్రమంలో స్వదేశీ నౌకా నిర్మాణ పరిశ్రమలో మరిన్ని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు , సరికొత్త స్టార్టప్‌లకు పెద్ద ఎత్తున అవకాశాలు కల్పిస్తూ మేలు చేస్తున్నామని చెప్పారు. భారత్ షిప్ బిల్డింగ్ సెంటర్లు ఇప్పుడు మరింత ఉత్సాహంగా పనిచేస్తూ.. ఒకదానిని మించి మరొకటి వేగవంతమైన యుద్ధనౌకలను స్వదేశంలోనే తయారు చేస్తున్నాయని ప్రశంసించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రక్షణ రంగానికి సంబంధించిన కీలకమైన మౌలిక వసతుల కల్పన శరవేగంగా జరుగుతోందని రాజ్‌నాథ్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో దేశంలోనే మొట్టమొదటి 'డ్రోన్ సిటీ' ఏర్పాటుకు అధికారికంగా శంకుస్థాపన జరిగిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కింద కర్నూలు పరిధిలోకి ఇప్పటికే 8 ప్రముఖ డ్రోన్ తయారీ కంపెనీలు వస్తున్నాయని, భవిష్యత్తులో ఈ ప్రాంతం దేశానికే ఒక పెద్ద 'డ్రోన్ హబ్' గా రూపాంతరం చెందబోతోందని స్పష్టం చేశారు. ఈ డ్రోన్ సిటీ ద్వారా దేశ రక్షణ అవసరాలు తీరడమే కాకుండా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి కేంద్రంగా రక్షణ రంగంలో మరో మైలురాయి లాంటి ప్రాజెక్టు వస్తోందని రక్షణమంత్రి తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన 'ఐదో తరం (ఫిఫ్త్ జనరేషన్) స్టెల్త్ యుద్ధ విమానాల' తయారీ ప్రాజెక్టు పుట్టపర్తిలో ఏర్పాటవుతోందని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజనరీ ఆలోచనల వల్లే రాష్ట్రంలో ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగాలు ఇంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఏరోస్పేస్ అభివృద్ధితో పాటు నావికాదళం కోసం ఐదో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ టెక్నాలజీ, సరికొత్త అండర్ వాటర్ టార్పెడో (జలాంతర్గామి విధ్వంసక అస్త్రాలు) అభివృద్ధి కూడా ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు.సముద్ర రక్షణ వ్యవస్థలో విశాఖపట్నం నగరం దేశంలోనే అత్యంత బలమైన వ్యూహాత్మక శక్తిగా నిలిచిందని రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు.

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ప్రాజెక్ట్-17ఏ శ్రేణిలో భాగంగా గతంలో ఉదయగిరి, నీలగిరి యుద్ధనౌకలను విజయవంతంగా ప్రవేశపెట్టామని.. ఆ తర్వాత 2026 ప్రణాళికల ప్రకారం తారాగిరిని, ఇప్పుడు సరికొత్తగా మహేంద్రగిరిని ప్రారంభించుకున్నామని టైమ్‌లైన్‌ను వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సాగర తీరాల రక్షణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా 'మహాసాగర్' పేరిట సరికొత్త అంతర్జాతీయ రక్షణ దృక్పథాన్ని ఆవిష్కరించామని చెప్పారు. సముద్ర మార్గాల భద్రతను పెంచడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సమయంలో సత్వరమే సాయం అందించడమే తమ ముందున్న ప్రధాన ఉద్దేశమన్నారు. నీటిలో, నేలపై, ఆకాశంలో శత్రువులను ముప్పేటలా ఎదుర్కొనే ధీశాలిగా నేడు భారతదేశం నిలుస్తోందని రక్షణమంత్రి గర్వంగా ప్రకటిస్తూ ప్రసంగాన్ని ముగించారు.

# పీడీఎస్‌యూ జాతీయ అధ్యక్షుడిగా కె. నాగరాజు

- జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఇ. విజయ్ కన్నా, కోశాధికారిగా కె. గణేష్
- జాతీయ విద్యా విధానం, యూనివర్సిటీ ఎన్నికలపై కీలక తీర్మానాలు

**హైదరాబాద్, జూలై 11 (వెలుతురు):**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జాతీయ జనరల్ కౌన్సిల్ సమావేశంలో కొత్త జాతీయ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూలై 10న దిల్‌సుఖ్‌నగర్‌లోని విద్యార్థి అమరవీరుల ప్రాంగణంలో జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్. కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 13 మంది సభ్యులతో కూడిన నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించారు.జాతీయ అధ్యక్షుడిగా కె. నాగరాజు (ఆంధ్రప్రదేశ్), జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఇ. విజయ్ కన్నా (తెలంగాణ), జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎస్. కిరణ్ కుమార్



కే నాగరాజు జాతీయ అధ్యక్షుడు...

(ఆంధ్రప్రదేశ్), జాతీయ సహాయ కార్యదర్శిగా ఏ. సాంబ (తెలంగాణ), జాతీయ కోశాధికారిగా కె. గణేష్ (తెలంగాణ) ఎన్నికయ్యారు. జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎస్.ఎండీ. రఫీ (ఆంధ్రప్రదేశ్), కె. పవన్ కుమార్ (తెలంగాణ), రామేశ్వర్ గాయల్ (మహారాష్ట్ర), పి. సతీష్ (తెలంగాణ), పవన్ రాథోడ్ (మహారాష్ట్ర), జవ్వాజి గణేష్ (తెలంగాణ), రాచకొండ రంజిత్ (తెలంగాణ) ఎన్నిక కాగా, మరో



ఈ విజయ్ కన్నా...జాతీయ ప్రధాన కార్యదర్శి..

కో-ఆప్షన్ సభ్యుడితో కలిపి మొత్తం 13 మందితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.సమావేశంలో పలు రాజకీయ, విద్యా సంబంధిత తీర్మానాలను ఆమోదించారు. నూతన జాతీయ విద్యా విధానం-2028ను రద్దు చేయాలని, నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, యూనివర్సిటీల్లో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్ట్ శక్తుల జోక్యాన్ని వ్యతిరేకించాలని, ప్రభుత్వ యూనివర్సిటీలకు అధిక నిధులు కేటాయించి విదేశీ, ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటును ప్రతిఘటించాలని, అలాగే దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేశారు.విద్యార్థి సమస్యలు, ఉన్నత విద్యలో తాజా పరిణామాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు పీడీఎస్‌యూ నూతన జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ. విజయ్ కన్నా తెలిపారు.



జాతీయ కోశాధికారి కే. గణేష్...

# రూ. 200 కోట్లతో నిర్మాణం..

# విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు

**మిరుదొడ్డి,జూలై 11 (వెలుతురు):**

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం హబ్సిపూర్ గ్రామ శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం ప్రతిపాదిత స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. నియోజకవర్గ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన ఉచిత విద్య అందించాలనే సంకల్పంతో ఈ పాఠశాలను దుబ్బాకకు తీసుకురావడానికి తాను మొదటి నుంచే కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ క్రమంలో హబ్సిపూర్ శివారులోని ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి స్కూల్ నిర్మాణానికి అనువైన అంశాలపై అధికారులతో సమీక్షించారు. 2024 లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు.స్కూల్ మంజూరును ఇతరులు తమ కృషిగా చెప్పుకోవడం ఆశ్చర్యంగా ఉందని విమర్శించారు. దుబ్బాక నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేసిందని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల



విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతులు, డిజిటల్ విద్య, క్రీడా సదుపాయాలు, పోటీ పరీక్షల శిక్షణ వంటి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత దుబ్బాక నియోజకవర్గం విద్యా రంగంలో గణనీయమైన మార్పు వస్తుందని, విద్యార్థుల భవిష్యత్తుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రభుత్వ విద్యకు కొత్త దిశ లభిస్తోందని చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

# పట్టిసీమ చంద్రబాబు దూరదృష్టికి సజీవ సాక్ష్యం

- టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని చంద్రశేఖర్

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని అనేక ప్రాంతాల్లో విపరీతమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని చంద్రశేఖర్ తెలిపారు శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో ఆయన మీడియా తో మాట్లాడారు.మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు భారీ వర్షాలు, వరదలతో ఇబ్బందులు పడుతుండగా... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రం సాధారణ వర్షపాతం కంటే దాదాపు 30 శాతం తక్కువ వర్షాలు నమోదయ్యాయని చెప్పారు.ముఖ్యంగా కృష్ణా పరివాహక ప్రాంతంలో నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా కృష్ణా డెల్టా రైతులు, రాయలసీమ రైతులు పెద్దగా ఆందోళన చెందకపోవడానికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఆయన నిర్మించిన పట్టిసీమ ఎత్తిపోతల పథకమేనని చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

### పట్టిసీమతో కృష్ణా డెల్టాకు ఊపిరి

గోదావరిలో వరద జలాలు సముద్రంలో కలిసిపోతున్న సమయంలో వాటిని వృథా కాకుండా కృష్ణా నదికి తరలించాలనే ఆలోచనతో చంద్రబాబు నాయుడు 2015లో పట్టిసీమ ప్రాజెక్టును చేపట్టి, ఏడాదిలోపే పూర్తి చేశారు. నేడు ఆ నిర్ణయం ఎంత దూరదృష్టితో తీసుకున్నదో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టమవుతోందన్నారు.ప్రస్తుతం గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో పట్టిసీమ ద్వారా 20 మోటార్ల సహాయంతో సెకనుకు 7,080 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదికి తరలిస్తున్నారని గత మూడు రోజుల్లోనే 1.33 టీఎంసీల గోదావరి జలాలు కృష్ణాకు చేరాయన్నారు.

### రూ.1,300 కోట్ల పెట్టుబడి... 452 టీఎంసీల జీవజలం

పట్టిసీమ నిర్మాణానికి సుమారు రూ.1,300 కోట్లు ఖర్చు చేశారని నిర్మాణం పూర్తయిన తర్వాత ఇప్పటివరకు దాదాపు 452 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా నదికి తరలించడం జరిగిందన్నారు నిర్వహణ, విద్యుత్ వ్యయాలతో కలిపి కూడా ఈ ప్రాజెక్టు రైతులకు అందించిన ప్రయోజనం అపారమైనదని చెప్పారు.ఈ ప్రాజెక్టు వల్ల 13 లక్షల ఎకరాల కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమైందని అలాగే కృష్ణా జలాలను శ్రీశైలం వద్ద నిల్వ ఉంచి రాయలసీమ ప్రాంతాలకు తరలించే అవకాశం కూడా ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు.హంద్రీ-నీవా, గలేరు-నగరి వంటి ప్రాజెక్టులకు ఇది ఎంతో మేలు చేసిందని ఆయన తెలిపారు.అప్పుడు 'వట్టిసీమ' అన్నారు... నేడు అదే రైతులకు వరం పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అప్పటి ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. పట్టిసీమ కాదు... వట్టిసీమ అంటూ ఎద్దేవా చేశారు. గోదావరి నుంచి కృష్ణాకు నీరు తరలించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.కానీ నేడు అదే పట్టిసీమ కృష్ణా డెల్టాకు ప్రాణాధారంగా మారిందని ఒకప్పుడు విమర్శించిన ప్రాజెక్టే ఈరోజు లక్షలాది రైతులకు భరోసాగా నిలిచిందన్నారు.రాయలసీమ అభివృద్ధికీ పట్టిసీమే బలం కృష్ణా డెల్టాకు గోదావరి నీరు అందించడం వల్ల కృష్ణా జలాలను రాయలసీమకు మళ్లించే అవకాశం లభించిందని ఫలితంగా సాగునీరు, తాగునీటి సమస్యలు తగ్గడమే కాకుండా ఉద్యానవన పంటల విస్తీర్ణం పెరిగిందన్నారు.

అనంతపురం వంటి కరవు జిల్లాల్లో కూడా నీటి లభ్యత మెరుగుపడటానికి ఇది కారణమైందని తెలిపారు.చంద్రబాబు దూరదృష్టి. జగన్ విధ్వంసక రాజకీయాలు చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారు. గోదావరి-కృష్ణా అనుసంధానం ద్వారా దేశంలోనే తొలి విజయవంతమైన నదుల అనుసంధానాన్ని ఆచరణలో చూపించారన్నారు.దీనికి భిన్నంగా గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని చెప్పారు.అనేక ప్రాజెక్టుల గేట్లు దెబ్బతినడం, నిర్వహణ లోపాలు బయటపడటం అందరికీ తెలిసిందే. సాగునీటి రంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల రాష్ట్ర రైతాంగం తీవ్రంగా నష్టపోయిం




దన్నారు.

### నీటి నిర్వహణలో జాతీయ దృక్పథం

నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల నుంచి నీటి కొరత ఉన్న ప్రాంతాలకు తరలించాలనే ఆలోచనను మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రతిపాదించగా, ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ కూడా నదుల అనుసంధానానికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు.ఆ జాతీయ ఆలోచనను ఆంధ్రప్రదేశ్‌లో ముందుగానే ఆచరణలో పెట్టిన నాయకుడు చంద్రబాబు నాయుడు. గోదావరి-కృష్ణా అనుసంధానంతో ప్రారంభమైన ఈ ప్రయాణం భవిష్యత్తులో కృష్ణా-పెన్నా, పెన్నా-కావేరి అనుసంధానాలకు కూడా మార్గం సుగమం చేస్తుందని చంద్రశేఖర్ తెలిపారు.రైతుకు భరోసా... అదే చంద్రబాబు పాలన ప్రకృతి విపత్తులు వచ్చినా, వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా రైతు భయపడకుండా ఉండే పరిస్థితిని సృష్టించడం ఒక సమర్థ నాయకత్వ లక్షణం. నేడు రాష్ట్ర రైతాంగం చూపుతున్న ఆత్మవిశ్వాసానికి కారణం చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పట్టిసీమ వంటి శాశ్వత పరిష్కారాలేనన్నారు. 2024లో ప్రజలు చంద్రబాబు నాయుడు పై ఉంచిన విశ్వాసం ఎందుకు సరైన నిర్ణయమో, నేడు రాష్ట్రంలో తీసుకుంటున్న నిర్ణయాలు మరోసారి రుజువు చేస్తున్నాయన్నారు.సంక్షోభాన్ని అవకాశంగా మార్చే నాయకత్వం అంటే ఏమిటో చంద్రబాబు నాయుడు తన పాలన ద్వారా మరోసారి నిరూపిస్తున్నారని అప్పసాని చంద్రశేఖర్ తెలిపారు.

# ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటాం

- ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మొజ్తబా
- తండ్రి మరణానికి బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్న మొజ్తబా ఖమేనీ
- దేశ ప్రజల ఆకాంక్షను తప్పకుండా నెరవేరుస్తానని స్పష్టీకరణ
- హంతకులను వదిలిపెట్టేది లేదంటూ టెలిగ్రామ్‌లో సందేశం
- అమరులైన వారందరికీ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందన్న వ్యాఖ్య
- తన నాయకత్వం కోసం కాదని.. దేశ గౌరవం కోసమే ఈ పోరాటమని వెల్లడి
- అమెరికా హెచ్చరికల మధ్య ఇరాన్ నుంచి తీవ్ర స్పందన
- తనను లక్ష్యంగా చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ట్రంప్ హెచ్చరిక
- అమెరికా–ఇజ్రాయెల్ దాడుల అనంతరం ప్రాంతంలో మళ్లీ ఉద్రిక్తతలు
- తండ్రి అంత్యక్రియలకు గాయాల కారణంగా హాజరు కాలేకపోయిన మొజ్తబా
- ఇరాన్ వైఖరిపై అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆసక్తి

**ఇరాన్ వెలుతురు జూలై 11:**

అమెరికా–ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కీలక ప్రకటన చేశారు. తన తండ్రి



ఆయతుల్లా అలీ ఖమేనీ మరణానికి బాధ్యులైన వారిపై ప్రతీకారం తప్పదని స్పష్టం చేశారు. ఈ అంశం తన వ్యక్తిగత నిర్ణయం కాదని, దేశ ప్రజల ఆకాంక్షేనని పేర్కొంటూ బాధ్యులంతా తమ చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ మేరకు టెలిగ్రామ్ వేదికగా విడుదల చేసిన సందేశంలో మొజ్తబా ఖమేనీ తీవ్ర భావోద్వేగంతో స్పందించారు. "మా నాయకుడితో పాటు అమరులైన వారందరి కోసం హంతకులపై ప్రతీకారం తీర్చుకుంటాం" అని పేర్కొన్నారు. ఇది ఏ ఒక్క నాయకుడి సంకల్పం మాత్రమే కాదని, దేశవ్యాప్తంగా ప్రజల మనోభావాలకు ప్రతిబింబమని ఆయన వ్యాఖ్యానించారు.ఇదిలా ఉండగా, ఇరాన్ తనపై లేదా ఇతర కీలక నాయకులపై దాడులకు ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల హెచ్చరించిన నేపథ్యంలో మొజ్తబా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇరు దేశాల మధ్య ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలపై అంతర్జాతీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఫిబ్రవరి 28న జరిగిన అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించగా, జులై 9న ఆయన అంత్యక్రియలు నిర్వహించినట్లు సమాచారం. అదే దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితి కారణంగా తండ్రి అంత్యక్రియలకు హాజరుకాలేకపోయినట్లు వెల్లడైంది.మొజ్తబా తాజా ప్రకటనతో అమెరికా–ఇరాన్ సంబంధాలు మరోసారి ఉద్రిక్త దశలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలపై ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి.

# మూగబోయిన మధురగానం.. ఎస్. జానకి కన్నుమూత

- వయోభారంతో వచ్చిన అనారోగ్య సమస్యలతో మైసూరులో తుదిశ్వాస
- ఆరు దశాబ్దాలకు పైగా భారతీయ సినీ సంగీతాన్ని మంత్రముగ్ధులను చేసిన గానగంధర్వి
- తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం సహా 18కు పైగా భాషల్లో వేలాది పాటలు
- 1957లో తొలి సినీ గీతంతో ప్రారంభమైన అపూర్వ సంగీత ప్రయాణం
- 40 వేలకుపైగా పాటలు ఆలపించి అరుదైన రికార్డు సృష్టించిన జానకి
- 'వెన్నెల్లో గోదారి అందం' పాటకు జాతీయ ఉత్తమ గాయనిగా గుర్తింపు
- నాలుగు జాతీయ పురస్కారాలు, 30కుపైగా రాష్ట్ర ప్రభుత్వ అవార్డులతో ఘన గౌరవం
- దక్షిణాది సినీ సంగీతానికి ఓ స్వర్ణయుగాన్ని అందించిన అపూర్వ గాయని
- భావవ్యక్తీకరణకు ప్రతిరూపంగా నిలిచిన జానకి గానం
- భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటు

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**

భారతీయ సినీ సంగీత ప్రపంచం ఓ మహోన్నత గాయనిని కోల్పోయింది. దక్షిణాది సంగీత అభిమానులు ప్రేమగా నైటింగేల్ ఆఫ్ సౌత్ ఇండియా అని పిలుచుకునే ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి కన్నుమూశారు. వయోభారంతో వచ్చిన ఆరోగ్య సమస్యల కారణంగా మైసూరులోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మరణవార్త తెలిసిన వెంటనే సినీ, సంగీత, రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అభిమానులు, సంగీత ప్రియులు సోషల్ మీడియా వేదికగా ఆమెకు నివాళులర్పిస్తున్నారు.1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పల్లపట్లలో జన్మించిన జానకి చిన్నప్పటి నుంచే సంగీతంపై అపారమైన ఆసక్తి కనబరిచారు. చిన్న వయసులోనే ఆకాశవాణి నిర్వహించిన జాతీయ స్థాయి గాన పోటీల్లో ప్రతిభ చాటుకుని తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసలు అందుకున్నారు. అదే ఆమె సంగీత జీవితానికి బలమైన పునాది అయింది.

జానకి సినీ గాన ప్రయాణం 1957లో ప్రారంభమైంది. తమిళ చిత్రం విధియిన్ విలయట్టు కోసం ఆమె తొలి సినీ పాటను రికార్డు చేశారు. అదే ఏడాది తెలుగు చిత్రం 'ఎంఎల్ఏ'కోసం కూడా పాటలు పాడి తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టారు. అలా మొదలైన ఆమె ప్రయాణం ఆరు దశాబ్దాలకుపైగా నిరాటంకంగా కొనసాగింది.తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు 18కు పైగా భారతీయ, విదేశీ భాషల్లో ఆమె పాటలు ఆలపించారు. వివిధ అంచనాల ప్రకారం ఆమె 40 వేలకుపైగా పాటలు పాడి భారతీయ సినీ సంగీత చరిత్రలో అత్యధిక గీతాలు ఆలపించిన గాయనుల్లో ఒకరిగా నిలిచారు. భావాలను స్వరంలో ఒలికించడంలో జానకి ప్రత్యేకత అసాధారణం. విషాదం, ప్రేమ, భక్తి, జానపదం, శృంగారం, హాస్యం, చిన్నపిల్లల గొంతు, వృద్ధురాలి స్వరం.. ఇలా ఏ భావాన్నైనా తన గాత్రంతో సజీవంగా వినిపించగల అరుదైన ప్రతిభ ఆమె సొంతం. అందుకే సంగీత దర్శకులు ఎం.ఎస్. విశ్వనాథన్,



సత్యం, కె.వి. మహదేవన్, చక్రవర్తి, ఇళయరాజా, ఎం.ఎం. కీరవాణి, ఏ.ఆర్. రెహమాన్ తదితరుల అభిమాన గాయనిగా నిలిచారు.తెలుగు సినీ సంగీతంలో జానకి ఆలపించిన ఎన్నో గీతాలు చిరస్థాయిగా నిలిచిపోయాయి.

"మౌనమేలనోయి",
"మాటరాని మౌనమిది"
"ప్రియతమా",
"ఓం నమః",
"తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు",
"ఇందువదన",
"ఆకాశం ఏనాటిదో",
"సిరిమల్లె పువ్వా",
"వెన్నెల్లో గోదారి అందం"

వంటి ఎన్నో పాటలు తరతరాల సంగీతాభిమానులను అలరించాయి.

జానకి నాలుగు సార్లు జాతీయ ఉత్తమ నేపథ్య గాయనిగా ఎంపికయ్యారు. తెలుగులో 984లో విడుదలైన 'సీతార' చిత్రంలోని 'వెన్నెల్లో గోదారి అందం' పాటకు ఆమె జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈ పాట ఆమె గాన ప్రస్థానంలో అత్యంత గొప్ప మైలురాయిగా నిలిచింది. తమిళం, మలయాళంలో కూడా ఆమె జాతీయ అవార్డులు గెలుచుకున్నారు.జాతీయ పురస్కారాలతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రభుత్వాల నుంచి అనేక రాష్ట్ర పురస్కారాలు అందుకున్నారు. మొత్తం మీద 30కుపైగా రాష్ట్ర స్థాయి అవార్డులు, జీవిత సాఫల్య పురస్కారాలు ఆమెను వరించాయి. 2013లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని ఆలస్యంగా ప్రకటించారనే కారణంతో ఆమె సున్నితంగా తిరస్కరించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.సుమారు ఆరు దశాబ్దాల పాటు భారతీయ సంగీత ప్రపంచాన్ని తన మధుర గానంతో మంత్రముగ్ధులను చేసిన జానకి 2017లో ప్రత్యక్ష సంగీత కచేరీలకు వీడ్కోలు పలికారు. మైసూరులో నిర్వహించిన సంగీత కార్యక్రమంతో తన వేదిక గాన ప్రయాణాన్ని ముగించారు. అయితే ఆమె ఆలపించిన వేలాది పాటలు నేటికీ సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఎస్. జానకి మరణంతో భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక మహోన్నత అధ్యాయం ముగిసింది. ఆమె గాత్రం ఇక వినిపించకపోయినా, ఆమె పాడిన వేలాది గీతాలు శాశ్వతంగా సంగీతాభిమానుల హృదయాల్లో మారుమోగుతూనే ఉంటాయి. ఆమె స్వరం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

# నేషనల్ టాలెంట్ హంట్ ప్రాథమిక ఇంటర్వ్యూలలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**

Spokesperson, రీసెర్చర్ (Researcher), పబ్లిసిటీ కోఆర్డినేటర్ (Publicity Coordinator) పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన నేషనల్ టాలెంట్ హంట్ ప్రాథమిక ఇంటర్వ్యూ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అభ్యర్థులతో ఆయన ప్రత్యక్షంగా మాట్లాడి వారి విద్యార్హతలు, నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యం, ప్రజా అవగాహన, సంస్థాగత పనితీరుపై అవగాహన వంటి అంశాలను పరిశీలించారు. ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే యువతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.సమాజ సేవ పట్ల నిబద్ధతతో పాటు ప్రజలతో మమేకమై



పనిచేసే సామర్థ్యం ఉన్న యువతను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించడమే ఈ టాలెంట్ హంట్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మహేష్ కుమార్ గౌడ్ గారు తెలిపారు.

# వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు

- తీరిన జిల్లా రైతాంగ దశాబ్దాల సాగునీటి కల
- కృష్ణమ్మ ఒడికి చేరిన గోదావరి నదీ జలాలు
- సాకారమైన రైతాంగ దశాబ్దాల స్వప్నం
- వైరా రిజర్వాయర్‌ను ముద్దాడిన గోదావరి నదీ జలాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంకల్పం
- పట్టుబట్టి ప్రతిష్టాత్మక లింక్ కెనాల్ పూర్తి చేయించిన వైనం
- రూ.100 కోట్ల వ్యయంతో రాజీవ్ లింక్ కెనాల్
- రికార్డు సమయంలో పనులు పూర్తి చేసిన యంత్రాంగం
- రెండు జిల్లాల పరిధిలో లక్షలాది ఎకరాలకు భరోసా
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం రైతులకు శాశ్వత పరిష్కారం

**ఖమ్మం జిల్లా వెలుతురు జూలై 11:**

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగ చరిత్రలో సరికొత్త సువర్ణాధ్యాయం లిఖించబడింది. ఈ ప్రాంత రైతాంగం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సాగునీటి కల ఎట్టకేలకు సాకారమైంది. సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నుంచి రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా పరుగులెత్తుకుంటూ వచ్చిన గోదావరి నదీ జలాలు వైరా రిజర్వాయర్‌కు విజయవంతంగా చేరుకున్నాయి. సుదీర్ఘ కాలంగా నీరు లేక వెలవెలబోయిన రిజర్వాయర్ ఇప్పుడు గోదావరి జలాల రాకతో జలకళను సంతరించుకుంది. పవిత్ర గోదావరి నదీ జలాలు వైరా జలాశయాన్ని ముద్దాడటంతో స్థానిక ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అద్భుత ఘట్టం జిల్లా వ్యవసాయ రంగాన్ని ప్రగతి పథంలో నడిపించనుంది.ఈ సుదీర్ఘ సాగునీటి స్వప్నం ఆచరణలోకి రావడానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన గట్టి సంకల్పం, పట్టుదలే ప్రధాన కారణం. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సాగునీటి పరంగా సస్యశ్యామలం చేయాలనేది ఆయన సుదీర్ఘ కాలపు ఆశయం. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మంత్రి తుమ్మల.. నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించారు. అధికారులు, ఇంజనీర్లను సమన్వయం చేస్తూ ఆటంకాలను అధిగమించారు. గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తరలించాలనే ఆయన దృఢ నిశ్చయం నేడు విజయవంతంగా ముగియడంతో జిల్లా వ్యాప్తంగా ఆయనపై ప్రశంసల జల్లు కురుస్తోంది.గోదావరి జలాలను విజయవంతంగా మళ్లించడం కోసం ప్రభుత్వం సుమారు వంద కోట్ల రూపాయల భారీ వ్యయంతో రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణాన్ని చేపట్టింది. సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువను వైరా రిజర్వాయర్‌తో అనుసంధానించేలా ఈ సరికొత్త కాలువ రూపకల్పన జరిగింది. భారీ నిధులను కేటాయించడమే కాకుండా, పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. సాంకేతిక సవాళ్లను అధిగమిస్తూ, రికార్డు సమయంలో ఈ లింక్ కెనాల్ నిర్మాణాన్ని పూర్తి చేయడం విశేషం. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ఇచ్చిన ప్రాధాన్యత వల్లే ఇంత వేగంగా నీరు అందుబాటులోకి వచ్చింది.ఈ సరికొత్త కాలువ ద్వారా కేవలం ఒక ప్రాంతానికే కాకుండా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని లక్షలాది ఎకరాలకు అత్యంత నమ్మకమైన రీతిలో సాగునీరు అందనుంది. ఈ రెండు జిల్లాల్లోని వ్యవసాయ భూములకు



శాశ్వతంగా సాగునీటి కొరతను తీర్చాలనే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం ఈ బృహత్తర ప్రణాళికను అమలు చేసింది. నిరంతరం నీటి ఇబ్బందులతో సతమతమయ్యే రైతులకు ఈ ప్రాజెక్ట్ ఒక పెద్ద భరోసాగా నిలిచింది. ఇకపై సాగునీటి కోసం వేరే వనరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా, రెండు పంటలకూ పుష్కలంగా నీరు అందుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రాజెక్టు విజయవంతం కావడంతో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల రంగ చరిత్రలోనే అత్యంత కీలకమైన మైలురాయి నమోదైంది. కృష్ణా బేసిన్ పరిధిలోకి వచ్చే వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి నది జలాలు చేరడం ద్వారా.. క్షేత్రస్థాయిలో కృష్ణా, గోదావరి నదుల అనుసంధాన ప్రక్రియ అద్భుతంగా సాకారమైంది. భౌగోళికంగా రెండు వేర్వేరు నదీ పరివాహక ప్రాంతాలను కాలువల ద్వారా కలపడం వల్ల భవిష్యత్తులో నీటి కొరత అనే మాటే రాదని సాగునీటి రంగ నిపుణులు కొనియాడుతున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టం భవిష్యత్ నీటిపారుదల ప్రాజెక్టులకు దిక్సూచిగా నిలుస్తుంది.నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని చివరి ఎకరానికి నీరు అందక ప్రతి ఏటా రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సాగర్ నుంచి వచ్చే నీరు టెయిల్ ఎండ్ (చివరి భూములు) కు చేరేసరికి సగం ఎండిపోయే పరిస్థితి ఉండేది. అయితే ఇప్పుడు వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు ప్రవహించడంతో ఆ ఇబ్బందులన్నీ తొలిగిపోయాయి. సాగర్ ఆయకట్టు పరిధిలోని చివరి ఎకరానికి సైతం పుష్కలంగా, తగిన సమయంలో నీరు అందించే మార్గం సుగమమైంది. దీనివల్ల చివరి భూముల రైతుల దశాబ్దాల సాగునీటి కష్టాలకు శాశ్వతంగా ముగింపు పడినట్లయింది.ఈ ప్రాంతంలో దశాబ్దాలుగా తీవ్రమైన సాగునీటి ఇబ్బందులు, అకాల వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండేవి. సకాలంలో వర్షాలు పడక, చెరువుల్లో నీరు లేక పంటలు ఎండిపోయి రైతులు ఆర్థికంగా చితికిపోయేవారు. అలాంటి కరువు పీడిత నేలకు ఇప్పుడు గోదావరి జలాలు ఒక సంజీవనిలా మారబోతున్నాయి. వర్షాలతో సంబంధం లేకుండా, నమ్మకమైన సాగునీటి వనరు అందుబాటులోకి రావడంతో రైతులు ఇకపై ధైర్యంగా వ్యవసాయం చేసుకోవచ్చు. ఈ పవిత్ర జలాలు భూగర్భ జల మట్టాన్ని కూడా పెంచి, తాగునీటి ఎద్దడిని సైతం నివారిస్తాయని అంచనా వేస్తున్నారు.గోదావరి జలాల రాకతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం కాబోతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లా వ్యవసాయ రంగంలో శాశ్వత స్థిరత్వం ఏర్పడటమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. తమ పొలాలకు గోదావరి నీరు వస్తుందని కలగన్న స్థానిక రైతాంగ లోకంలో నేడు సరికొత్త ఆశలు చిగురించాయి. కాలువల వెంట నీరు ప్రవహిస్తుంటే రైతులు గంగమ్మకు పూజలు చేస్తూ తమ హర్షాతిరేకాలను వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చాలనే ప్రభుత్వ సంకల్పం ఈ ప్రాజెక్టు ద్వారా నిజమైందని సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# మూసి ప్రాజెక్ట్ ప్రక్షాళనకు రూ. 7345 కోట్ల రూపాయలు ఉంటాయి గాని పేద పిల్లలు చదువుకోవడానికి మాత్రం డబ్బులుండవా ???

- ఫీజు బకాయిలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మనసు ఒప్పడం లేదు.
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆగ్రహం

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**

14 లక్షల మంది పేద విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలకు మాత్రం డబ్బులు ఉండవు కానీ మూసి ప్రాజెక్టు ప్రక్షాళనకు రూ.7345 కోట్ల రూపాయలు ఉంటాయా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ప్రశ్నించారు. మూసి ప్రాజెక్టు ముఖ్యమా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుసుకోవాలన్నారు.గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ రాక విద్యార్థులు బాధపడుతుంటే గాంధీ ప్రాజెక్టు కడతామని శపధాలు చేస్తున్నారని ఇది ప్రజా పాలన కాదు నియంత పాలన అని ఆయన ధ్వజమెత్తారు.



# ఇరాన్ అణు కేంద్రాల్లో మళ్లీ కదలికలు

- పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు
- అమెరికా దాడులతో దెబ్బతిన్న అణు కేంద్రాల వద్ద కార్యకలాపాలు
- ఉపగ్రహ చిత్రాల్లో నిర్మాణ పరికరాలు, \వాహనాల కదలికలు
- అణు కార్యక్రమం పునరుద్ధరణే లక్ష్యమా..? అంతర్జాతీయంగా ఆందోళన
- శిథిలాల తొలగింపా.. రహస్య పునర్నిర్మాణమా..?
- హర్మూజ్ జలసంధి వివాదంతో అమెరికా—ఇరాన్ మధ్య ఉద్రిక్తత
- ఒప్పందాన్ని ఇరాన్ ముందుగానే ఉల్లంఘించిందా..? అన్న అనుమానాలు
- "1000 క్షిపణులు సిద్ధంగా ఉన్నాయి" అంటూ ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- హెచ్చరికల అనంతరం టెహ్రాన్‌లో భారీ పేలుళ్లతో కలకలం
- తాజా పేలుళ్ల వెనుక ఎవరున్నారన్న దానిపై స్పష్టత కరువు
- అణు కార్యక్రమం, హర్మూజ్ సంక్షోభంతో కొత్త దశలోకి అమెరికా—ఇరాన్ విభేదాలు



**పశ్చిమాసియా వెలుతురు జూలై 11:**

పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. అమెరికా—ఇరాన్ మధ్య ఇటీవల నెలకొన్న ఘర్షణల అనంతరం ఇరాన్ అణు కేంద్రాల వద్ద మళ్లీ కార్యకలాపాలు ప్రారంభమైనట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఈ విషయాన్ని గుర్తించినట్లు సమాచారం. అమెరికా దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్న అణు కేంద్రాల పునర్నిర్మాణం కోసం ఇరాన్ వేగంగా చర్యలు చేపడుతోందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా మరోసారి ఆందోళనకు దారితీశాయి.అమెరికా ఇటీవల జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్‌కు చెందిన కీలక అణు కేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని గతంలో వెల్లడైంది. అయితే తాజా ఉపగ్రహ చిత్రాల్లో ఆ ప్రాంతాల్లో భారీ నిర్మాణ పరికరాలు, ట్రక్కులు, ఇతర వాహనాల కదలికలు స్పష్టంగా కనిపించాయని అంతర్జాతీయ మీడియా పేర్కొంది.

దెబ్బతిన్న భవనాల చుట్టూ నిర్మాణ కార్యకలాపాలకు సంబంధించిన మార్పులు కూడా గుర్తించినట్లు వెల్లడించింది.ఈ చిత్రాలను అమెరికాకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ (ISIS) విశ్లేషించింది. ఉపగ్రహ చిత్రాల ప్రకారం అణు కేంద్రాల వద్ద గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని సంస్థ పేర్కొంది. అయితే ప్రస్తుతం జరుగుతున్న పనులు అణు కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించడానికా, లేక దాడుల్లో దెబ్బతిన్న ప్రాంతాలను శుభ్రం చేసి నష్టాన్ని అంచనా వేసేందుకా అన్నది స్పష్టంగా చెప్పలేమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.అమెరికా—ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ప్రకారం ఇరాన్ శుద్ధి చేసిన యురేనియాన్ని నిల్వ చేయకూడదని, అణ్వాయుధాల తయారీ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకూడదని అమెరికా పదేపదే స్పష్టం చేస్తోంది.

అయితే జూన్ చివరి వారంలోనే ఇరాన్ ఈ ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అణు కేంద్రాల వద్ద కనిపిస్తున్న తాజా కదలికలు ఆ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయని అంతర్జాతీయ పరిశీలకులు భావిస్తున్నారు.మరోవైపు హర్మూజ్ జలసంధి వివాదం అమెరికా—ఇరాన్ సంబంధాలను మరింత సంక్లిష్టంగా మార్చింది. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ మార్గంపై తన ప్రభావాన్ని కొనసాగించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని అమెరికా ఆరోపిస్తోంది. తన అనుమతి లేకుండా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుపుతోందని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌తో కుదిరిన ఒప్పందం ఇక ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించారు.ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య ట్రంప్ ఇరాన్‌కు మరోసారి ఘాటైన హెచ్చరికలు జారీ చేశారు. "ఇరాన్ వైపు 1000 క్షిపణులను లోడ్ చేసి సిద్ధంగా ఉంచాం.

అవసరమైతే వెంటనే స్పందిస్తాం" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలను సొంతం చేసుకోకూడదని, అణు కార్యక్రమాన్ని విస్తరించేందుకు చేసే ప్రతి ప్రయత్నాన్ని అమెరికా అడ్డుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.ట్రంప్ హెచ్చరికలు వెలువడిన కొద్ది గంటల్లోనే ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుళ్లు చోటుచేసుకున్నట్లు సమాచారం వెలువడింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వరుసగా పేలుడు శబ్దాలు వినిపించాయని స్థానిక మీడియా పేర్కొంది. అయితే ఈ పేలుళ్లకు కారణం ఏమిటి, అవి వైమానిక దాడుల ఫలితమా, లేక అంతర్గత ప్రమాదమా అన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక స్పష్టత రాలేదు. తాజా దాడుల వెనుక ఏ దేశం లేదా ఏ సంస్థ ఉందన్నదీ వెల్లడికాలేదు.ఇరాన్ అణు కేంద్రాల వద్ద కనిపిస్తున్న కదలికలు, హర్మూజ్ జలసంధి వివాదం, ట్రంప్ హెచ్చరికలు, టెహ్రాన్‌లో పేలుళ్లు వంటి పరిణామాలు కలిసి పశ్చిమాసియాలో పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చుతున్నాయి.

ఇరాన్ నిజంగానే అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తుందా, లేక దాడుల్లో దెబ్బతిన్న కేంద్రాలను మాత్రమే పునర్నిర్మిస్తుందా అన్న అంశంపై ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే అమెరికా—ఇరాన్ మధ్య మరోసారి ప్రత్యక్ష ఘర్షణలు చెలరేగే అవకాశం ఉందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## జవహర్ బాల్ మంచ్ రెండు రోజుల "మిరాయి" జాతీయ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, వెలుతురు జూలై 11, 2026:**




తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు శనివారం రోజున గాంధీ భవన్‌లో జవహర్ బాల్ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల "మిరాయి" జాతీయ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ శిక్షణ శిబిరానికి జవహర్ బాల్ మంచ్ జాతీయ అధ్యక్షులు శ్రీ జి.వి. హరి గారు అధ్యక్షత వహించగా, తెలంగాణ జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర చైర్మన్ అడ్వకేట్ మామిడి రిషికేశ్ రెడ్డి గారు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు జవహర్ బాల్ మంచ్‌కు తన పూర్తి మద్దతును ప్రకటించడంతో పాటు, తెలంగాణలో నిర్వహించనున్న తదుపరి జాతీయ బాలల శిబిరానికి కూడా సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.నేటి తరానికి భారతదేశ ఆలోచన (Idea of India), పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మరియు కాంగ్రెస్ సిద్ధాంతాలను చేరవేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, ఫాసిస్టు శక్తులను ఎదుర్కొనే స్ఫూర్తిని యువతలో పెంపొందించాలని, నెహ్రూ—గాంధీ భావజాలాన్ని ప్రతి యువకుడు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి జవహర్ బాల్ మంచ్ జాతీయ సమన్వయకర్తలు, రాష్ట్ర చైర్మన్లు ఈ రెండు రోజుల "మిరాయి" శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారు. యువ నాయకుల్లో నాయకత్వ లక్షణాలు, సంస్థాగత నైపుణ్యాలు మరియు సేవాభావాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ శిక్షణ శిబిరం ప్రధాన లక్ష్యం.

## జులై 30 నాటికి అయోధ్య నిర్మాణ పనులు పూర్తి

- ఆలయ సముదాయం వెలుపల మౌలిక వసతులు
- సెప్టెంబర్ నాటికి ప్రహరీ గోడ నిర్మాణం
- ఆధునిక సాంకేతికతతో రామ్ కథా సంగ్రహాలయం
- 20 గ్యాలరీలతో భక్తులకు శ్రీరాముడి చరిత్ర

**అయోధ్య వెలుతురు జూలై 11:**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది హిందువుల ఆరాధ్య దైవమైన అయోధ్యలోని శ్రీరామ చంద్రుడి ఆలయ ప్రధాన నిర్మాణ పనులు జులై 30 నాటికి పూర్తిగా ముగియనున్నాయి. రామాలయ ప్రాజెక్టు పనులు ఇప్పుడు తుది దశకు చేరుకున్నాయని ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాజీ ముఖ్య కార్యదర్శి నృపేంద్ర మిశ్రా అధికారికంగా వెల్లడించారు. శనివారం ఆయన మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఈ కీలక వివరాలను పంచుకున్నారు. ప్రధాన ఆలయ కట్టడానికి సంబంధించిన కీలకమైన పనులన్నీ నిర్దేశిత గడువు లోపలే పూర్తవుతాయని, పనుల వేగంపై తాము పూర్తి సంతృప్తితో ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.ప్రధాన ఆలయంతో పాటు దానికి అనుబంధంగా నిర్మిస్తున్న వివిధ రకాల స్మారక కట్టడాల పనులు కూడా ఇప్పటికే సింహభాగం పూర్తయ్యాయని నృపేంద్ర మిశ్రా వివరించారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నిరంతరం వెలిగేలా ఏర్పాటు చేయనున్న అఖండ జ్యోతికి సంబంధించిన సాంకేతిక, మౌలిక పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, మిగిలిన నిర్మాణాలన్నీ దాదాపుగా ఒక కొలిక్కి వచ్చాయని చెప్పారు. ఆలయ సముదాయంలో నిర్మిస్తున్న మరో ప్రధాన స్మారక కట్టడం కూడా జులై చివరి నాటికే అందుబాటులోకి వస్తుందని, దీనితో ఆలయానికి సంబంధించిన అత్యంత ప్రధానమైన నిర్మాణ ఘట్టాలన్నీ సంపూర్ణంగా ముగుస్తాయని ఆయన పేర్కొన్నారు.ప్రధాన ఆలయ నిర్మాణం జులై నాటికి పూర్తయినప్పటికీ, రామమందిర సముదాయానికి వెలుపల భక్తుల కోసం చేపడుతున్న కొన్ని ఇతర మౌలిక వసతుల పనులు మరికొంత కాలం పాటు కొనసాగుతాయని కమిటీ ఛైర్మన్ తెలిపారు. ముఖ్యంగా ఆలయ సంరక్షణ కోసం నిర్మిస్తున్న సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవైన భారీ ప్రహరీ గోడ నిర్మాణాన్ని సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. అలాగే ఆలయ ప్రాంగణానికి వెలుపల విభిన్న కార్యక్రమాల కోసం నిర్మిస్తున్న భారీ ఆడిటోరియం పనులు ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబర్ నెల వరకు కొనసాగే అవకాశం ఉందని నృపేంద్ర మిశ్రా వెల్లడించారు.అయోధ్యకు వచ్చే భక్తులకు శ్రీరాముడి పవిత్ర చరిత్ర, భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని సరికొత్త రీతిలో పరిచయం చేసేందుకు 'రామ్ కథా సంగ్రహాలయం' (మ్యూజియం) ను డిజైన్ చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందుతున్న ఈ మ్యూజియం పనులపై మిశ్రా మాట్లాడారు. ఇందులో మొత్తం 20 ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నామని, వీటికి సంబంధించిన కథా రూపకల్పన (స్క్రిప్ట్) ఇప్పటికే పూర్తయిందని చెప్పారు. ఈ గ్యాలరీలలో డిజిటల్ టెక్నాలజీ, త్రీడీ వీడియో ప్రదర్శనలను ఎలా ఉపయోగించాలనే అంశంపై తుది నిర్ణయం తీసుకునేందుకు నిపుణులతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.రామమందిర ప్రారంభం తర్వాత ప్రతిరోజూ దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు అయోధ్యకు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ నియంత్రణ, భద్రత, రోజువారీ పరిపాలనా నిర్వహణ వంటి అంశాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ఒక ప్రశ్నకు నృపేంద్ర మిశ్రా చాలా స్పష్టంగా సమాధానమిచ్చారు. ఆలయ దైనందిన నిర్వహణ మరియు రద్దీ నియంత్రణ వ్యవస్థలను తాను వ్యక్తిగతంగా పరిశీలించడం లేదని చెప్పారు. ఆ బాధ్యతలు, అధికారాలు ఏవీ తన పరిధిలోకి రావని, తన పని కేవలం ఆలయ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయించడం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఆలయ సముదాయం పూర్తిగా అందుబాటులోకి వస్తే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు లభిస్తాయన్నారు.ఇటీవల కాలంలో కలకలం రేపిన రామమందిర విరాళాల చోరీ కేసుపై నృపేంద్ర మిశ్రా అత్యంత ఆవేదనతో స్పందించారు. ఈ ఘటనను తాను కేవలం కానుకల దొంగతనంగానే చూస్తున్నానని పేర్కొన్నారు. ఆలయ ట్రస్ట్ కోశాధికారి స్వామి గోవింద్ దేవ్ గిరి అన్నట్లుగానే.. ఈ ఘటన తమ అందరిపై ఒక పెద్ద మచ్చ లాంటిదని వ్యాఖ్యానించారు. పవిత్రమైన రామమందిర ప్రాంగణంలో ఇలాంటి దొంగతనం జరగడం తీవ్రమైన అవమానకరమైన విషయమని, మనందరికీ సిగ్గుచేటని అన్నారు. ఇది ఖచ్చితంగా పరిపాలనాపరమైన లోపమేనని అంగీకరించిన ఆయన, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తామనే నమ్మకాన్ని వ్యక్తపరిచారు.అయోధ్య రామమందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల సొమ్ము భారీగా మాయమైనట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటికే గుర్తించింది. నిందితులు సుమారు రెండు నుంచి మూడు కోట్ల రూపాయల భారీ మొత్తాన్ని దొంగిలించినట్లు ప్రాథమిక ఆధారాలను సేకరించింది. రామాలయ ప్రాంగణంలోని విరాళాల కౌంటింగ్ కేంద్రాల నుంచే ఈ సొమ్ము మాయమైనట్లు అధికారులు తెలిపారు. నిందితులు ఒకేసారి కాకుండా, గత రెండు మూడు నెలల కాలంలో రూ.500 నోట్ల కట్టలను కొద్దికొద్దిగా దొంగతనం చేస్తూ ఈ భారీ స్కామ్‌కు పాల్పడినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఈ దొంగతనం వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు పోలీసులు ముమ్మరంగా శ్రమిస్తున్నారు.ఈ విరాళాల చోరీ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో, ఈ వ్యవహారంపై కోర్టు పర్యవేక్షణలో నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ నెల 13వ తేదీన విచారణ చేపట్టనుంది. దేశ అత్యున్నత న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. సుప్రీంకోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించడంతో, దొంగతనానికి బాధ్యులైన వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటారు, నిధుల భద్రతపై కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇస్తుందనే అంశంపై ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

## హైదరాబాద్‌కు భారీ విమాన సేవలు

- తెలంగాణకు ప్రపంచ అనుసంధానం మరింత బలోపేతం కానున్న సంకేతాలు
- విమానయాన రంగంలో పెట్టుబడులకు కొత్త అవకాశాలు

**హైదరాబాద్ వెలుతురు జూలై 11:**

తెలంగాణలో విమానయాన రంగాన్ని మరింత విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమానయాన సంస్థ ఎమిరేట్స్ భారతదేశం, నేపాల్ విభాగాల ఉపాధ్యక్షుడు మహ్మద్ సర్హాన్‌తో సమావేశమై హైదరాబాద్‌కు భారీ ప్రయాణికుల విమాన సర్వీసులు ప్రారంభించడంతో పాటు రాష్ట్రంలో విమాన సేవలను విస్తరించాలని కోరారు.ఈ సందర్భంగా హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సామర్థ్యం, పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ, రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలను ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్‌కు భారీ ప్రయాణికుల విమానాలను నడపడంతో పాటు ప్రస్తుతం ఉన్న విమాన సర్వీసుల సంఖ్యను కూడా పెంచాలని కోరారు.రాష్ట్రంలో విమానయాన రంగానికి ఉన్న అవకాశాలను వివరిస్తూ వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో కొత్త విమానాశ్రయాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదిగే సామర్థ్యం ఉందని పేర్కొన్నారు.విమానాల మరమ్మతులు, నిర్వహణకు సంబంధించిన కేంద్రాలను తెలంగాణలో ఏర్పాటు చేసి విస్తరించాలని కూడా ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. దీంతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు విమానయాన రంగం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.విమానయాన రంగంతో పాటు క్రీడా రంగంలోనూ తెలంగాణతో భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి కోరారు. గచ్చిబౌలిలో ఏర్పాటు చేస్తున్న క్రీడా విశ్వవిద్యాలయంలో క్రీడాకారుల శిక్షణ కార్యక్రమాలకు ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.ముఖ్యమంత్రి చేసిన ప్రతిపాదనలపై మహ్మద్ సర్హాన్ సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌కు భారీ ప్రయాణికుల విమాన సర్వీసుల నిర్వహణ అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. అలాగే రాష్ట్రంలో విమానయాన రంగ విస్తరణ, క్రీడాకారుల శిక్షణకు సహకారం అందించే అంశాలను కూడా సంస్థ స్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు.ఈ సమావేశం తెలంగాణకు అంతర్జాతీయ విమాన అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, విమానయాన రంగ అభివృద్ధికి దోహదపడే కీలక పరిణామంగా భావిస్తున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి – టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం

**రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు మరోసారి అవకాశం కల్పిస్తారనే విశ్వాసం**

**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్**

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జోడెద్దుల్లా సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం, పార్టీ రెండింటినీ సమర్థంగా ముందుకు నడిపిస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండగా, మరోవైపు పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మరింత బలోపేతం చేయడంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విశేష కృషి చేస్తున్నారని ఆయన అన్నారు.ఈ ఇద్దరు నాయకుల సమన్వయం కాంగ్రెస్ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చిందని, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పార్టీ ప్రజలతో మమేకమవుతున్న తీరు కాంగ్రెస్‌పై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని తెలిపారు.ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పిస్తారనే బలమైన విశ్వాసం తమకు ఉందని కొప్పుల ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు."ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జోడెద్దుల్లా పార్టీ, ప్రభుత్వాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, కార్యకర్తల బలోపేతమే వారి లక్ష్యం. ఈ కృషిని ప్రజలు ఆదరిస్తారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మరోసారి అవకాశం ఇస్తారనే పూర్తి విశ్వాసం మాకు ఉంది."విద్య, వైద్యానికి పెద్దపీట... రైతన్నలకు అండగా... ప్రజలతో మమేకమవుతున్న సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అభివృద్ధికి విద్య, వైద్యం, వ్యవసాయం అనే మూడు ప్రధాన స్తంభాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని



కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు.నాణ్యమైన విద్య ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉండేలా, మెరుగైన వైద్య సేవలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వారు చెబుతున్నారు. విద్య, వైద్యం ప్రజల ప్రాథమిక హక్కులనే భావనతో పాలన కొనసాగుతోందని వారు పేర్కొంటున్నారు.అన్నదాత సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే చర్యలు తీసుకుంటోందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. రైతు శ్రమకు తగిన గౌరవం, భరోసా కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని వారు తెలిపారు.

తేకాకుండా, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వేగంగా స్పందించే నాయకత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రదర్శిస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజలతో నిరంతర అనుబంధం కొనసాగిస్తూ, వారి ఆశయాలకు అనుగుణంగా పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు."విద్యకు నాణ్యత, వైద్యానికి అందుబాటు, రైతుకు భరోసా, ప్రతి కుటుంబానికి సంక్షేమం —— ఇదే తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి దిశ" అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

**కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక – ప్రతి కార్యకర్తకు అండగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

కాంగ్రెస్ పార్టీ బలం కార్యకర్తలేనని విశ్వసిస్తూ, ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుడిలా భావించి, వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిరంతరం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులతో నిరంతరం సమావేశమవుతూ, కార్యకర్తల సమస్యలను తెలుసుకోవడం, వారి అవసరాలకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాలను రూపొందించడం, సంస్థాగత వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడం కోసం ఆయన ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు.పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త అభిప్రాయం విలువైనదనే భావనతో, కింది స్థాయి కార్యకర్త నుంచి సీనియర్ నాయకుల వరకు అందరి సూచనలను స్వీకరిస్తూ సమిష్టి నాయకత్వాన్ని బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు."కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం కార్యకర్తలే. ప్రతి కార్యకర్తను కలుస్తూ, వారి సమస్యలు, సూచనలు, ఆశయాలను తెలుసుకొని పార్టీ నిర్మాణంలో భాగస్వాములను చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గారి నాయకత్వం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. కార్యకర్తలే పార్టీ వెన్నెముక అనే సిద్ధాంతంతో ఆయన ముందుకు సాగుతున్నారు."పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో, కార్యకర్తల అంకితభావాన్ని గౌరవిస్తూ, సమిష్టి కృషితో కాంగ్రెస్ పార్టీని మరింత శక్తివంతమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కృషి చేస్తున్నారని కొప్పుల ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.



**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్**

# న్యూజిలాండ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి శ్రీకారం

- వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణకు కీలక నిర్ణయం
- రక్షణ సహకారానికి కొత్త ఊపు
- విద్యా రంగంలో భాగస్వామ్యానికి అంగీకారం
- సంస్కృతి, క్రీడల్లో సహకారం మరింత బలోపేతం
- ప్రజల మధ్య సంబంధాల విస్తరణకు ప్రాధాన్యం
- న్యూజిలాండ్ ప్రభుత్వం, ప్రజలకు మోదీ కృతజ్ఞతలు
- ఈ పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త అధ్యాయం
- భారత్–న్యూజిలాండ్ స్నేహబంధం మరింత బలపడిందన్న మోదీ

**న్యూజిలాండ్ వెలుతురు జూలై 11:**

న్యూజిలాండ్ పర్యటన విజయవంతంగా ముగిసిన సందర్భంగా అక్కడి ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్, ప్రభుత్వం, ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనకు అందించిన ఆత్మీయ స్వాగతం, ఆతిథ్యం తనను ఎంతో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని న్యూజిలాండ్‌ను సందర్శించడం ఇరు దేశాల సంబంధాల్లో చారిత్రక ఘట్టంగా నిలిచిందని చెప్పారు.ఈ పర్యటనతో భారత్–న్యూజిలాండ్ ద్వైపాక్షిక సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెట్టాయని మోదీ తెలిపారు. ఇరు దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచాలని నిర్ణయించడం కీలక పరిణామమన్నారు. ఈ నిర్ణయం ద్వారా రాజకీయ, ఆర్థిక, భద్రతా రంగాల్లో పరస్పర సహకారం మరింత బలోపేతం కానుందని అభిప్రాయపడ్డారు.వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో కొత్త అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. వ్యాపార సంబంధాలను మరింత విస్తరించడంతో పాటు పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పరస్పరం సహకరించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.రక్షణ, విద్య, సంస్కృతి, క్రీడలు, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని మోదీ తెలిపారు. ఈ పర్యటనతో భారత్–న్యూజిలాండ్ స్నేహబంధం మరింత బలపడిందని, భవిష్యత్తులో ఉమ్మడి అభివృద్ధి లక్ష్యాలతో కలిసి ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు.








Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com